

నగరానికి లోకేశ్



ఎయిర్‌పోర్ట్‌లో మంత్రి నారా లోకేశ్. చిత్రంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి వంగలపూడి అనిత, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉన్నారు.

గోపాలపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో బాధితులను పరామర్శించడానికి రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో శనివారం సాయంత్రం నాలుగు గంటలకు నగరానికి చేరుకున్నారు. ఆయన్ను ఎయిర్‌పోర్టులో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తదితరులు కలిశారు. అనంతరం నారా లోకేశ్, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత రోడ్డు మార్గంలో కాశీబుగ్గ బయలుదేరి వెళ్లారు.

వచ్చే నెల 6న వన్డే

- భారత్, దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్
- వేదికగా ఏసీఏ-వీడీసీఏ స్టేడియం



విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మరో వన్డే మ్యాచ్‌కు విశాఖ ఆతిథ్యమివ్వనుంది. పోతినమల్లయ్యపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో వచ్చే నెల (డిసెంబరు) 6న భారత్, దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్ నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈనెల 14 నుంచి వచ్చే నెల 19 వరకు భారత్‌తో పర్యటించనున్న దక్షిణాఫ్రికా జట్టు రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనున్నది. వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ రాంచీ, రెండో మ్యాచ్ రాయపూర్‌లో జరగనుండగా... డిసెంబరు 6న జరగనున్న మూడో వన్డేకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదిక కానుంది. ఇప్పటివరకూ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మూడు టెస్టులు, 10 వన్డేలు, నాలుగు టీ20 మ్యాచ్‌లు జరిగాయి. 11వ వన్డే మ్యాచ్ నిర్వహణకు ఏసీఏ ప్రతినిధులు సిద్ధమవుతున్నారు.



డీసీపీ-1గా మణికంఠ - 6వ పేజీలో

కనకమహాలక్ష్మి ఆలయంలో ఏకపక్ష ధోరణి

- స్థానికులకు తగ్గిపోతున్న ప్రాధాన్యం
- మార్గశిర మాసోత్సవం ముహూర్తపు రాటకు బురుజుపేట మహిళలను దూరంగా పెట్టిన వైనం
- నిరసన వ్యక్తం చేయడంతో లోపలకు అనుమతి



ముహూర్తపు రాట కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న పురుషులు

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి దేవస్థానం అధికారులు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దేవస్థానంలో మార్గశిర మాసోత్సవాలు అతి పెద్ద కార్యక్రమం. దీనికి శనివారం ముహూర్తపు రాట వేశారు. ఏటా ఈ కార్యక్రమంలో బురుజుపేటకు చెందిన స్థానిక మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని పసుపు రాసి పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. అంతా అయిన తరువాత దేవస్థానం అధికారులు పసుపు, కుంకుమతో పాటు జాకెట్ ముక్కలు పెట్టి వారిని సత్కరిస్తారు. ఈసారి ఆలయ అధికారులు స్థానిక మహిళలను ఈ కార్యక్రమానికి దూరంగా పెట్టారు. కేవలం రాజకీయ నాయకులకే ప్రాధాన్యం ఇచ్చారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, ఇతర ప్రముఖులతో రాట పూజ చేయించారు. ఇందులో ముత్తయిదువుల ... మిగతా 6వ పేజీలో

ప్రేమసమాజం భూములపై పెద్దల కన్ను

దీర్ఘకాలిక లీజుకు తీసుకోవాలని యత్నం

- దేవదాయ శాఖ భూములకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు యత్నం
- అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరిస్తారా?, లేదా?....
- సర్వత్రా అనుమానాలు



రుషికొండలో ఏ-1 గ్రాండ్‌ను అనుకొని ఉన్న ప్రేమ సమాజం భూములు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

డాబాగార్డెన్స్‌లోని సేవా సంస్థ ప్రేమ సమాజం భూములపై కొందరు పెద్దల కన్నుపడింది. వాటిని దీర్ఘకాలిక లీజుకు తీసుకునేందుకు యత్నిస్తున్నారు. దీనికి సంస్థ కార్యవర్గంలో కొందరు సహకరిస్తున్నారు. దీంతో తాజాగా ప్రభుత్వం దేవదాయ శాఖకు చెందిన భూములను దీర్ఘకాలిక లీజుకు ఇచ్చేందుకు అనుమతిస్తూ జారీచేసిన ఉత్తర్వులను అందుకు అనుకూలంగా మలచుకుంటున్నారు.

ప్రేమ సమాజానికి కొన్ని దశాబ్దాల క్రితం దాతలు రుషికొండ సర్వే నంబర్లు 16, 23, 24లలో 47.33 ఎకరాలు దానంగా ఇచ్చారు. వాటిలో కొన్ని బీచ్‌ను అనుకొని ఉన్నాయి. అందులో 33.4 ఎకరాలను ఓ రిసార్ట్ యాజమాన్యం చాలాకాలం కిందట లీజుకు తీసుకుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ భూములపై కన్నేసింది. వాటిని చేజిక్కించుకోవడానికి ప్రేమ సమాజాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకువస్తూ ఆదేశాలు ఇచ్చింది. లీజుదారుడు టీడీపీ సానుభూతిపరుడని పేర్కొంటూ ఆయన దగ్గరున్న భూమిలో 28 ఎకరాలు వెనక్కి తీసుకుంది. ఆ భూములతో కలిపి ఇప్పుడు సుమారు 40 ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. అప్పట్లో విశాఖ డెయిరీ పెద్దలు గెస్ట్‌హౌస్‌లు నిర్మిస్తామంటూ వాటిని లీజుకు తీసుకోవాలని యత్నించారు.ఇందుకోసం ప్రేమ సమాజం పెద్దలతో సంప్రతింపులు జరిపారు. నాటి రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి అండగా ఉండడంతో అప్పట్లో దేవదాయ శాఖ ... మిగతా 6వ పేజీలో

వైద్యుడి వక్రబుద్ధిపై ఆరా

కలకలం రేపిన ఆంధ్రజ్యోతి కథనం

- ఏం జరిగిందో ఆరా తీసిన ఆంధ్ర మెడికల్ కళాశాల అధికారులు
- బయటకు వస్తున్న మరిన్ని అడ్డగోలు వ్యవహారాలు
- పుట్టిన రోజు వేడుకలకు ఖరీదైన బహుమతులు ఇవ్వాలని వైద్య విద్యార్థులకు ఆదేశం



'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనం

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులు, నర్సింగ్ సిబ్బందిని వేధిస్తున్న ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని ఓ అధికారి వ్యవహారశైలిపై 'వైద్యుడి వక్రబుద్ధి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనం వైద్య వర్గాల్లో కలకలం రేపింది. ఇప్పటికైనా ఆయన బండారం బయటపడిందంటూ చాలామంది ఆనందాన్ని వ్యక్తం చేయగా, కొందరు మాత్రం...ఎవరా వైద్యుడు అంటూ ఆరా తీశారు. ఇకపోతే, ఆంధ్ర మెడికల్ కళాశాల అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు సదరు వైద్యుడికి సంబంధించి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించే ... మిగతా 6వ పేజీలో

రహదారులపై వాహన వేగ పరిమితి పెంపు

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రధాన రహదారులపై వాహనాల వేగ పరిమితిని పెంచుతూ సీపీ శంఖబ్రతబాగ్చి శనివారం ఆదేశాలు జారీచేశారు. ప్రధాన రహదారులు, బీఆర్‌టీఎస్ కారిడార్, జాతీయ రహదారిపై వాహనాలకు ఒక నిర్ణీత వేగ పరిమితి ఉంటుంది. అంతకు మించిన వేగంతో నడిపితే ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కింద ఈ-చలాన్ జారీ అయిపోతుంది. జాతీయ రహదారిపై ఈ-మర్రిపాలెం నుంచి కూర్మన్నపాలెం జంక్షన్ వరకు వేగపరిమితి ప్రస్తుతం గంటకు 40 కిలోమీటర్లు ఉండగా, ఇప్పుడు 50కి పెంచారు. కొమ్మాది జంక్షన్ నుంచి రాజులపాలెం వరకూ వేగపరిమితి గంటకు 40 కిలోమీటర్లు ఉండగా, 50 కిలోమీటర్లకు పెంచారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో పెందుర్తి నుంచి బాజీ జంక్షన్ వరకు ప్రస్తుతం 40 కిలోమీటర్లు వేగపరిమితి ఉండగా, దానిని ఇప్పుడు 50 కిలోమీటర్లకు పెంచారు. బీచ్‌రోడ్డులో ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకు గంటకు 40 కిలోమీటర్లు వేగపరిమితి ఉండగా, దానిని అలాగే కొనసాగించాలని నిర్ణయించారు. ఆనందపురం జంక్షన్ నుంచి పెందుర్తి మీదుగా పినగాడి వరకు వేగపరిమితి ప్రస్తుతం 60 కిలోమీటర్లు ఉండగా, దానిని అలాగే ఉంచారు. నగర పరిధిలోని మునిసిపల్ రోడ్లపై గంటకు 40 కిలోమీటర్లు వేగపరిమితిని అలాగే కొనసాగించాలని సీపీ నిర్ణయించారు. నిర్ణీత వేగానికి మించి వాహనాలను నడిపితే ట్రాఫిక్ ఉల్లంఘన కింద ఈ-చలాన్ ద్వారా జరిమానా విధిస్తామని సీపీ హెచ్చరించారు.

నేడు డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా రాక

- పోలీస్ మెస్ ఆధునికీకరణకు శంకుస్థాపన
- అనంతరం 14 స్టార్‌హోటళ్లతో ఒప్పందం
- పెట్టుబడుల సదస్సుకు భద్రతా ఏర్పాట్లపై సాయంత్రం సమీక్ష



విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీస్ శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) హరీష్ కుమార్‌గుప్తా ఆదివారం నగరానికి రానున్నారు. ఉదయం పది గంటలకు బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్‌కు చేరుకుంటారు. మెస్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వెళతారు. ఐపీఎస్ అధికారులకు బస కల్పించే అంశంపై నగరంలోని 14 స్టార్ హోటళ్లతో డీజీపీ ఒప్పందం చేసుకుంటారు. అనంతరం కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు వెళ్లి పది వేల కిలోల గంజాయిని నిర్వీర్యం చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో సీఐఐ సదస్సుకు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లపై ఉత్తరాంధ్రలోని పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

అప్పన్నకు స్వర్ణ తులసీ దళార్చన



సింహాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామికి అర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ తులసీ దళార్చన శనివారం వైభవంగా జరిపారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం నిత్య కల్యాణం నిర్వహించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



ఆస్పత్రి రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జగదీశ్వరరావు

ఆనందపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ పి. జగదీశ్వరరావు శనివారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి, వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. సమయపాలన పాటించాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు అందరూ వేయాలని చెప్పారు. అలాగే వర్షాలు అనంతరం ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆయనతో పాటు వైద్యులు ఉమావతి, రవిశంకర్, నారాయణరావు ఉన్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సభ్యులు

ఆనందపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములవలసలో ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ అడ్వైజర్ కోన ప్రకాశ్, కోశాధికారి పచ్చిపులుచు కనకారావు, ఆ సంఘం మండల అధ్యక్షుడు పోతిరెడ్డి సుధాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లకు వేతనాల చెల్లింపు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :దివీస్ కర్మాగారం పరిధిలో వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న 16 మంది విద్యా వలంటీర్లకు కంపెనీ ప్రతినిధులు శనివారం అక్టోబరు నెల జీతాలు చెల్లించారు. 16 మంది వలంటీర్లను దివీస్ కంపెనీ గతంలో నియమించింది. వారికి ప్రతి నెల రూ. లక్ష చొప్పున ఏడాదిలో 11 నెలలకు రూ. 11 లక్షలు వేతనాలుగా చెల్లిస్తుంది. ఈమేరకు చిప్పాడ దివీస్ కర్మాగారంలో జనరల్ మేనేజర్ రావు వలంటీర్లకు గత నెల వేతనాలు అందజేశారు. ఈకార్యక్రమంలో కంపెనీ అధికారులు జగదీశ్, సామాజిక సేవా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

'కార్మిక సంఘాలు వెనక్కి తగ్గకూడదు'

తగరపువలస, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్ మిల్లు యాజమాన్యం భూముల అమ్మకానికి సంబంధించిన అటాచ్‌మెంట్‌ను తొలగించరాదని కార్మిక సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన ప్రకటనను స్వాగతిస్తున్నామని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కేవీ నరసింహరాజు అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2019లో మిల్లు మూతపడిన తరువాత కూడా యాజమాన్యం యంత్రాల అమ్మకానికి ప్రయత్నించిందని, దానికి అప్పట్లో కొన్ని సంఘాలు ఆమోదం తెలిపాయని చెప్పారు. అటాచ్‌మెంట్ తొలగింపులో అన్ని సంఘాలు ఒకే మాట మీద ఉండాలని కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ : ఎంపీడీఓ

పద్మనాభం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కె. రూపేశ్ తెలిపారు. శనివారం ఆయన మద్ది గ్రామంలో పారిశుధ్యం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల వల్ల గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొందని, ఇళ్ల మధ్య నీరు నిల్వ లేకుండా ప్రజలు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కూర్మారావు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మృతులకు నివాళి

తగరపువలస, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లా పలాస కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది మృతి చెందిన సంఘటనపై మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని, వారికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు.

91.81 శాతం పింఛన్లు పంపిణీ

భీమునిపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భీమిలి జోన్‌లో శనివారం 91.81 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయం ఆరున్నర నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేదరవీధిలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. జోన్‌లో మొత్తం 8548 మంది లబ్ధిదారులకు రూ. 3,73,24,500 కోట్లకు 7848 మందికి రూ. 3,38,33,500 కోట్ల బట్వాడా చేశామని జడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చిన్ని కుమారిలక్ష్మి, గంటా అప్పలకొండ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

డీసీపీ-1గా మణికంఠ చందోలు

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో డీసీపీ-1గా మణికంఠ చందోలును నియమిస్తూ డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఉన్న కృష్ణకాంత్‌ను విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మణికంఠను నియమించారు. మణికంఠ గతంలో డీసీపీ-1గా నగరంలో పనిచేశారు. రెండు రోజుల కిందట డీసీపీ-1గా జగదీశ్‌ను నియమించారు. తాజా ఉత్తర్వులతో ఆయన నియామకం రద్దయినట్టు అయ్యింది.



భీమిలిలో సొమ్మగిరి కింద మెట్ల వద్ద పూజలు చేస్తున్న భక్తులు



సింహాచలం శివాలయంలో భక్తులు

ఆలయాల్లో కార్తీక ఏకాదశి పూజలు

- వేకువజాము నుంచే బారులు తీరిన భక్తులు
- ఇబ్బందులు లేకుండా నిర్వాహకుల ఏర్పాట్లు

భీమునిపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస ఏకాదశి పురస్కరించుకుని శివ, కేశవ క్షేత్రాలన్నీ భక్తులతో శనివారం కిటకిటలాడాయి. భీమిలిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. మండలంలోని పరిసర ప్రాంతాలతో పాటు విశాఖ నగరం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. గిరి దిగువన స్వామివారి పాదాల చెంత పూజలు చేసి కొండపై ఉన్న స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ వల్ల కొండ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. రాత్రి వరకూ దర్శనానికి వస్తూనే ఉన్నారు. కృష్ణాకాలనీ వెంకటగిరిపై వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ఏకాదశి పూజలు నిర్వహించారు. స్వామివారు చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈనెల 4వ తేదీ వరకు స్వామివారు చందన అలంకరణలో దర్శనం ఇస్తారని ఆలయ సంక్షేమ సంఘం నాయకులు గాదు అప్పలనాయుడు, రేలంగి పెదబాబు, కంటుభుక్త ముత్యాలరావు తెలిపారు. ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా స్వామివారు చందన అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కెఎస్ఎన్ మూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, వుశిరికల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో...

సింహాచలం : నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు వేకువజామున సింహగిరికి చేరుకుని గంగధార, వేగవతి జల ధారల్లో స్నానాలు ఆచరించారు. అనంతరం సింహగిరి క్షేత్ర పాలకుడు, శివుడ్ని దర్శించుకున్నారు. అర్చకులు తొలుత ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు గోత్రనామాలతో, అలాగే లోకకల్యాణార్థం అనే సంకల్పంతో ఏకవార రుద్రాభిషేకం జరిపారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ప్రధాన రాజగోపురానికి సమీపంలో ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి సన్నిధిలో, విజినిగిరిపాలెం, పాతఅడివివరం, సింహాచలం ప్రాంతాల్లోని శివాలయాలకు కూడా భక్తులు పోటెత్తారు.

అనంతుని క్షేత్రంలో...

పద్మనాభం : పద్మనాభంలోని అనంత పద్మనాభుని క్షేత్రంలో కార్తీక ఏకాదశి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొండపై ఉన్న అనంత పద్మనాభునికి, దిగువన ఉన్న కుంతీ మాధవస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి వరకు దర్శనాలు కొనసాగాయి.కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, సర్పంచ్ టి. పాప, పద్దు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి,ఎర్నాయుడు దంపతులు పాల్గొన్నారు. అలాగే గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత లక్ష్మీగణపతి ఆలయంలో పరమశివునికి మహాన్యాసపూర్వక సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



పద్మనాభంలోని అనంత పద్మనాభునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

వైద్య రంగంలో రేడియాలజీ పాత్ర కీలకం

- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని సత్కరిస్తున్న సదస్సు నిర్వాహకులు

ఎండాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో రేడియాలజీ కీలక పాత్ర పోషిస్తుందని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జీమ్సర్)లోని డాక్టర్ యల్లా ప్రగడ సుబ్బారావు ఆడిటోరియం వేదికగా ఇండియన్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ (ఐఆర్ఐఏ) ఏపీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సును శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేడియాలజీ విభాగం సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దేశవ్యాప్తంగా రేడియాలజిస్టుల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించనున్నట్టు తెలిపారు. చిన్మయ విశ్వవిద్యాపీఠ్ మేనేజింగ్ ట్రస్టీ ముక్కమాల అప్పారావు మాట్లాడుతూ రేడియాలజీలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆగ్మెంటెడ్ ఇంటెలిజెన్స్ వినియోగంతో రాబోయే దశాబ్దాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. అనంతరం న్యూఢిల్లీ ఎయిమ్స్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజుశర్మకు కాకర్ల స్వర్ణ పతకం, తిరుపతి ఎస్వీఐఎంఎస్‌కి చెందిన డాక్టర్ ఏవై లక్ష్మీకి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, డాక్టర్ కె. సుషెన్‌కుమార్‌కి డాక్టర్ జీవీ మోహన్ ప్రసాద్ గోల్డ్ మెడల్ (బెస్ట్ యంగ్ అచీవర్) ప్రదానం చేశారు. అలాగే ఇటీవల ఏషియన్ మస్కులోస్కెలెటల్ సొసైటీ అధ్యక్షుడిగా ఎంపికైన విజయవాడకు చెందిన డాక్టర్ వీఎన్ వరప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీమ్సర్ ప్రో వీసీ డాక్టర్ గీతాంజలి, ఏపీ ఐఆర్ఐఏ అధ్యక్షుడు, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ వి. సురేశ్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు, ఏపీఐఆర్ఐఏ సెక్రటరీ ఉమామహేశ్వరరెడ్డి, కేజీహెచ్ రేడియాలజీ హెచ్ఓడీ డాక్టర్ బుచ్చిబాబు, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, అపోలో హెచ్‌వోడీ డాక్టర్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



విరాళం చెక్ అందజేస్తున్న దాత

సింహాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని మురళీనగర్ ప్రాంతానికి చెందిన బొడ్డు భగవాన్ పాత్రుడు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం చెక్ రూపంలో పర్యవేక్షణాధికారి పి. సునీల్‌కు శనివారం ఆయన అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

అప్పన్న స్వామిని రాష్ట్ర సముద్ర మండలి చైర్మన్ దామచర్ల సత్యనారాయణ (సత్య), మేయర్ శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ వరాహనరసింహం శనివారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు.కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా

బాలిక కుటుంబానికి ఎమ్మెల్యే గంటా పరామర్శ

పద్మనాభం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తునిపాలెం గ్రామంలో గెడ్డలో పడి మృతి చెందిన బాలిక కుటుంబాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన తక్షణ సాయం కింద రూ. 4 లక్షల పరిహారం చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన ధనుశ్రీ గెడ్డలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపత్తు ప్రతి స్పందన నిధి నుంచి రూ. 4 లక్షల పరిహారం మంజూరు చేశాయి. చెక్కును బాలిక తల్లిదండ్రులు కాళ్ల గౌరి, శ్రీనుకు ఎమ్మెల్యే అందజేశారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కె. ఆనందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, మాజీ అధ్యక్షుడు నగేశ్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ ఘటన కలచివేసింది

విశాఖపట్నం : కాశీబుగ్గలో శనివారం జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసిందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. దైవ దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని ఆలయ నిర్వాహకులు అంచనా వేయకపోవడం దురదృష్టకరమన్నారు. ముందుగా వారు పోలీసులకు సమాచారం ఇచ్చినా ఇంతటి ఘోరం జరిగి ఉండేది కాదన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతులకు కేంద్రం రూ. 2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 15 లక్షలు పరిహారం ప్రకటించిందన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన ముగ్గురు టీడీపీ కార్యకర్తలకు ప్రమాద బీమా కింద రూ. ఐదు లక్షలు అందిస్తామని చెప్పారు.

వైద్యుడి వక్రబుద్ధిపై ఆరా

... 5వ పేజీ తరువాయి

పనిలో నిమగ్నమయ్యారు. సదరు వైద్యుడు పనిచేస్తున్న ఆస్పత్రికి కళాశాల అధికారులు ఫోన్లు చేసి వివరాలు సేకరించారు. అసలేమి జరుగుతోందని సీనియర్ వైద్యులతో పాటు వైద్య విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అయితే కొంతమంది వైద్యులు, విద్యార్థినులు తమకు ఎటువంటి ఇబ్బందులు వస్తాయోనన్న భయంతో ఏమీ తెలియదని తప్పుకునే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. ఇదిలావుంటే సదరు వైద్యుడి గురించి మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వచ్చే నెలలో తన పుట్టినరోజు ఉందని, ఖరీదైన గిఫ్ట్ ఇవ్వాలని వైద్య విద్యార్థులకు చెప్పినట్టు తెలిసింది. అలాగే ఏదైనా సమస్య వస్తే తనకు మాత్రమే చెప్పాలని, కాదు..కూడదు అంటే మీ భవిష్యత్తు నా చేతిలో ఉందన్న విషయం మర్చిపోవద్దంటూ వైద్య విద్యార్థులను తన గ్రిప్‌లో పెట్టుకునే ప్రయత్నం చేస్తుంటారని చెబుతున్నారు. వసూళ్ల వ్యవహారాలకు ప్రత్యేకంగా ఒకరిని పెట్టుకున్నట్టు చెబుతున్నారు.

భయం..భయంగానే..

ఇదిలావుండగా ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో తమను మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తారేమోనని వేధింపులకు గురైన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అయితే, మెడికల్ కాలేజీ అధికారులు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొన్నవారు తమ వద్దకు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని చెబుతున్నారు. విద్యార్థులు తన వద్దకు వచ్చి చెబితే న్యాయం చేస్తానని, వారి వివరాలను బయటకు వెల్లడించే ప్రసక్తే లేదని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి తెలిపారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఏకపక్ష ధోరణి

... 5వ పేజీ తరువాయి

కంటే పురుషులే పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. దీనిపై స్థానిక మహిళలు కొద్దిసేపు నిరసన వ్యక్తంచేయడంతో ఆ తరువాత వారిని లోపలకు అనుమతించారు. అమ్మవారి దర్శనాలు చేయించి జాకెట్ ముక్కలు పెట్టి పంపించారు.

ఈఓపై కలెక్టర్‌కే ఫిర్యాదు

ఆలయ ఈఓ శోభారాణిపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు 38వ వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. కార్తీక మాసంలో అయ్యప్పస్వాములు మాలలు వేసుకుంటారని, అమ్మవారి సమక్షంలో మాలధారణ చేయడం ఆనవాయితీగా వస్తుంటే...దానికి ఈఓ అనుమతించడం లేదని ఆమె ఫిర్యాదు చేశారు. కొన్ని దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీని పక్కనపెట్టి మాలలు బయట వేసుకోవాలని చెబుతున్నారని, ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్‌ను కోరారు.

ఆలయాల్లో భద్రత కల్పించాలి

మధురవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాశీబుగ్గ ఆలయంలో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఆలయాల్లోనూ భద్రత కల్పించాలని భక్తులు కోరుతున్నారు. మధురవాడ పరిసరాల్లోని ఆలయాల్లో కూడా కార్తీక సోమవారాలు, శివరాత్రి, వైకుంఠ ఏకాదశి రోజుల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆలయాల్లో క్యూలైన్లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



బాధితులకు సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మూడు వేల మందికి నిత్యావసర సరుకులు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో మూడు వేల మంది తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు అందించామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన తోటవీధి వార్డు సచివాలయంలో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ తీవ్ర ప్రభావం చూపినప్పటికీ నష్టం నివారణలో అధికారులు, సిబ్బంది ఎంతగానో శ్రమించారని ప్రశంసించారు. ప్రకృతి విపత్తును ఆపే శక్తి ఎవరికీ లేదని, కానీ టెక్నాలజీ ద్వారా నష్టం తీవ్రతను తగ్గించడం సంతృప్తినిచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధతో ప్రజాప్రతినిధులను, అధికారులను నిరంతరం అప్రమత్తం చేస్తూ నష్ట తీవ్రతను తగ్గించారని చెప్పారు. ముఖ్యంగా పెదనాగమయ్యపాలెం గ్రామం అర్ధరాత్రి 1.20 సమయంలో గోస్తనీ ముంపునకు గురికాగా అధికారులు అప్పటికప్పుడు 32 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించడం అభినందనీయమన్నారు.పద్మనాభం మండలం మద్దిలో 13 ఏళ్ల బాలిక నదీ ప్రవాహంలో కొట్టుకుపోయి చనిపోవడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గాదు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, జోనల్ కమిషనరు ఒమ్మి అయ్యప్పనాయుడు, తహశీల్దార్ రామారావు, నాయకులు చిక్కాల విజయ్‌బాబు, గంటా నూకరాజు, గాదు అప్పలనాయుడు, వెంకటప్పడు, గొలగాని నరేంద్రకుమార్, యరబాల అనిల్ ప్రసాద్, గరికిన కింగ్, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న, కంచర్ల కామేశ్ పాల్గొన్నారు.

పీఎంపాలెంలో...

కొమ్మాది : తుఫాన్ వల్ల ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అందించిన నిత్యావసర సరుకులను పీఎంపాలెంలో కూటమి నాయకులు శనివారం పంపిణీ చేశారు. 50 కిలోల బియ్యం, కిలో కంది పప్పు, లీటర్ వంట నూనె, కిలో బంగాళదుంపలు, ఉల్లిపాయలు అందజేశారు. 12 మంది లబ్ధిదారులకు వీటిని అందించినట్టు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాసరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చక్రవర్తి, గురునాథ్, సంతోష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో ఐదు మంది తుఫాన్ బాధితులకు కూటమి నాయకులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కె.ఆనందరావు, టీడీపీ నాయకులు నందీశ్వరరావు, నగేశ్ కుమార్, ఎం. శ్రీను, నక్కిన బంగారి తదితరులు పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవాలకు రాట

మహారాణిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బురుజుపేటలోని కనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల శుభారంభ సూచికగా శనివారం రాట మహోత్సవం నిర్వహించారు. ఏటా కార్తీక శుద్ధ ఏకాదశి రోజున అంకురార్పణ చేస్తారు. ఉదయం 10.53 గంటలకు నాదస్వరం, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా రాట మహోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవంలో పాల్గొన్న ముత్తయిదువులకు పసుపు కుంకుమలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్లు విజయలక్ష్మి నరసింహాచారి, ఆలయ కార్యనిర్వహణాధికారులు పాల్గొన్నారు.

అక్రమ భవనాలు కూల్చేయండి

రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో ప్లాన్‌కు విరుద్ధంగా ఈఏడాది ఆగస్టు తర్వాత నిర్మించిన భవనాలను కూల్చేయాలని రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని కార్పొరేషన్లు, పట్టణ స్థానిక సంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభు త్వం మార్గదర్శకాలు రూపొందిస్తోంది. అందులోభాగంగా 1985 నుంచి ఈఏడాది ఆగస్టు 31 మధ్య కాలంలో ఆమోదించిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈమేరకు అక్రమ నిర్మాణాలు ఊపందుకునే అవకాశం ఉంది కనుక వాటికి అడ్డు కట్టవేసేందుకు కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈఏడాది ఆగస్టు 31 తర్వాత ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించే అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనలు, యూనిట్ డీవియేషన్ చేసే భవనాలను గుర్తించి తొలగించనున్నారు.ఈమేరకు జీవీఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు 560 వార్డు సచివాలయాల పరిధిలో 2,500 మంది వార్డు సచివాలయ కార్యదర్శులకు సర్వే బాధ్యతలు అప్పగించారు. ఒక్కో సచివాలయానికి నలుగురు నుంచి ఆరుగురు వరకు కార్యదర్శులను నియమించింది. వారంతా రెండు రోజుల్లో తమకు కేటాయించిన వార్డు సచివాలయం పరిధిలో నిర్మాణంలో ఉన్న భవనాలతోపాటు ఇప్పటికే పూర్తయిన అక్రమ నిర్మాణాలను గుర్తించి నేరుగా డీటీసీపీకే నివేదిక అందజేయాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2019లో చివరిసారిగా జీవీఎంసీ పరిధిలో బీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయగా భవనాల క్రమబద్ధీకరణకు ఆరువేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. తాజాగా బీపీఎస్‌ను ప్రకటిస్తే ఏడు వేల వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆగస్టు 31 తర్వాత జరిగే అక్రమ నిర్మాణాలను తొలగించాల్సి వస్తే ఒక్కో వార్డులో వందల సంఖ్యలో అక్రమ భవనాలు, అదనపు అంతస్తులను తొలగించాల్సి ఉంటుంది. డీటీసీపీ ఆదేశాల మేరకు అధికారులు చర్యలకు ఉపక్రమిస్తే అక్రమ భవన నిర్మాణదారులకు ఇబ్బందులు తప్పవు.

ప్రేమ సమాజం భూములపై పెద్దల కన్ను

... 5వ పేజీ తరువాయి

అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన కాళింగిరి శాంతి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారు. అయితే అంతా రచ్చ రచ్చ కావడంతో వైసీపీ నాయకులు వెనక్కి తగ్గారు.

ఖాళీగా ఉంచకూడదని వారి ఆలోచన

రుషికొండలో ఇప్పుడు ఎకరా భూమి రూ.40 కోట్లు పలుకుతోంది. ఆ లెక్కన ప్రేమ సమాజం భూమి విలువ సుమారు రూ.1,500 కోట్లు దాటి ఉంటుంది. అంత విలువైన భూమిని కాపాడడం కష్టమని, ఎవరికైనా లీజుకు ఇస్తే ఆదాయం వస్తుందని ప్రస్తుత కార్యవర్గం వాదిస్తోంది. రోడ్డు పక్కన కంటెయినర్లు పెట్టి అద్దెకు ఇస్తే ఆదాయం వస్తుందని కొందరు ప్రతిపాదించారు. అరకులోయ ప్రాంతం నుంచి గిరిజనులను తీసుకువచ్చి, వారికి అక్కడే నివాసం ఏర్పాటుచేసి, వారితో ఆర్గానిక్ వ్యవసాయం చేయించాలని మరికొందరు ప్రతిపాదించారు. వారు అక్కడే ఉంటారు కాబట్టి భూములకు రక్షణ ఉంటుందని ఆలోచించారు. ఇంకొందరు కల్యాణ మండపం నిర్మించాలని, గెస్ట్‌హౌస్‌లు నిర్మిస్తే, బాక్స్ క్రికెట్ వంటివి ఏర్పాటుచేస్తే బాగుంటుందని సూచించారు. కార్యవర్గం ఒక అభిప్రాయానికి రాకపోవడం, ఇది బయటకు పొక్కడంతో కొందరు కూటమి నేతలు రంగంలో దిగారు. ఆ భూములను తమ వారికి దీర్ఘకాలిక లీజుకు ఇప్పించుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. తమకు పది ఎకరాలు లీజుకు ఇవ్వాలని, క్రికెట్ ప్లేయర్లకు అక్కడ శిక్షణ ఇస్తామని కొందరు ప్రతిపాదించారు. ఇంకొందరు మంచి కన్వెన్షన్ సెంటర్‌తో పాటు రెస్టారెంట్ ఏర్పాటుచేస్తామని, ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్ పెడతామని 5 నుంచి 10 ఎకరాలు లీజుకు ఇవ్వాలని కోరారు. దీర్ఘకాలిక లీజుకు సంబంధించి ప్రభుత్వం నుంచి తాము ఆదేశాలు వచ్చేలా చూసుకుంటామని భరోసా ఇచ్చారు.

వేలం వేసే ఇవ్వాలి

ఇదిలావుండగా ఖాళీగా ఉన్న దేవదాయ శాఖ భూములను దీర్ఘకాలిక లీజుకు ఇవ్వాలని, ఇందుకోసం నలుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులతో రుషికొండలో ప్రేమ సమాజం భూములను దక్కించుకునే ప్రక్రియ వేగవంతం అవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే భూములను ఎవరికైనా లీజుకు ఇవ్వాలని అనుకుంటే పత్రికల్లో ప్రకటన ఇచ్చి బహిరంగ వేలం ద్వారానే కేటాయించాలి. అలా నిబంధనలను పాటిస్తారా? లేక ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా దక్కించుకుంటారా? అనేది చూడాలి.

మత్స్యశాఖ జేడీకి సీఎం అవార్డు


సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న జేడీ లక్ష్మణరావు

బీచ్‌రోడ్డు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌లో మత్స్యకారులకు మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు అందించిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శనివారం ఉండవల్లిలోని సీఎం కార్యాలయంలో అవార్డును ప్రదానం చేశారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

ప్రమాదకరంగా రహదారులు

- భారీ వర్షాలకు పిక్క తేలిన రోడ్లు
- దుమ్ము, ధూళితో నిండిపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్న వాహనాలు

ఆరిలోవ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెం నుంచి హనుమంతవాక జంక్షన్ వరకూ వచ్చే మార్గంలో రోడ్డు పాడైంది. గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై పిక్క పైకి తేలడంతో ధూళి చెలరేగుతోంది, రోడ్డంతా పిక్కమయం కావడంతో వాహనాలు అదుపుతప్పి రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వారు రోడ్డుపై పిక్కను గమనించకుండా వాహనాలను వేగంగా పోనిస్తుండడంతో ప్రమాదాలు ఎదురవుతున్నాయి.

రోడ్డు నిండా పిక్క నిండి ఉండడంతో రద్దీ సమయాల్లో ధూళి రేగి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇది కూడా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోందని వాహనదారులు వాపోతున్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి ఈ మార్గంలో పాడైన రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


పిక్క తేలిన వెంకోజీపాలెం-హనుమంతవాక రోడ్డు


చినగదిలి సాయిబాబ గుడి కూడలిలో పాడైన రహదారి

అలాగే.. చినగదిలి సాయిబాబా గుడి నుంచి ఆరిలోవకు వెళుతున్న రోడ్డు గతుకులమయంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ గోతులు కనిపిస్తున్నాయి. ఈ సమస్యపై పలుమార్లు వినతులు సమర్పించినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థి దశ నుంచి నిజాయితీగా మెలగాలి

- విజిలెన్స్ డీఎస్పీ మురళీకృష్ణ


విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ మురళీకృష్ణ

మద్దిలపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యువత విద్యార్థి దశ నుంచే నిజాయితీగా మెలిగితే అవినీతి రహిత సమాజం ఏర్పాడుతుందని విజిలెన్స్ డీఎస్పీ ఎన్.మురళీకృష్ణ పేర్కొన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన జాతీయ విజిలెన్స్ వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నేటి విద్యార్థులే రాబోయే కాలంలో ప్రభుత్వ అధికారులు, పాలకులుగా మారుతారన్నారు. విద్యార్థి దశలోనే నిజాయితీగా ఉంటే వివిధ రంగాల్లో ప్రవేశించిన తర్వాత మెరుగైన సమాజ స్థాపనకు కృషి చేస్తారన్నారు. భారత పౌరులుగా దేశాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ తమ బాధ్యతను నెరవేర్చాలని సూచించారు. అవినీతి దుష్ప్రభావాలు నివారణకు పాటుపడాలని కోరారు. అనంతరం యూత్ యాజ్ టార్చ్ బేరర్స్ ఆఫ్ విజిలెన్స్ అండ్ రెస్పాన్స్‌బిలిటీ అంశంపై వ్యాసరచనా పోటీలు నిర్వహించి విజేతలకు ఆయన ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, పి.రమణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత, అధ్యాపకులు సన్యాసిరావు, వేదవ్యాస్, ఆర్పీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై పెల్లుబికిన నిరసన

- దూకేస్తామంటూ భవనంపైకి ఎక్కిన మృతుడి సోదరుడు, మిత్రులు
- మహిళా అధ్యాపకుల అరెస్టుకు డిమాండ్
- భీమిలి ఆర్డీవో, ప్రిన్సిపాల్, అధికారుల హామీతో ఆందోళన విరమించిన విద్యార్థులు, బాధిత కుటుంబం


కళాశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు
భవనం పై నుంచి దూకెస్తామంటూ హెచ్చరిస్తున్న స్టూడెంట్స్

ఎంవీపీ కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీకాలనీలోని సమతా డిగ్రీ కళాశాల విద్యార్థి సాయితేజ ఆత్మహత్య విద్యార్థుల్లో ఆగ్రహం పెల్లుబికేలా చేసింది. న్యాయం కావాలంటూ రోడ్డెక్కిన విద్యార్థులు కళాశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. మహిళా అధ్యాపకులను అరెస్టు చేయాలన్న డిమాండ్‌తో ఉదయం నుంచి ఆందోళన చేపట్టారు. ఓ పక్క మృతుడి బంధువులు కూడా కళాశాల ప్రాంగణం వద్ద నిరసన వ్యక్తం చేసి, లోపలకు వెళ్లేందుకు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు నిలువరించారు. రహదారిపై ప్రయాణించే వాహనాలను అడ్డుకుని ధర్నా చేశారు. సాయంత్రానికి మరింత మంది విద్యార్థులు తోడై నిరసన ఉధృతం చేశారు. మృతుడి సోదరుడు, మరో ముగ్గురు మిత్రులు కళాశాల భవనంపైకి ఎక్కి, న్యాయం చేయకపోతే అక్కడి నుంచి దూకేస్తామంటూ బెదిరించారు. తల్లిదండ్రులు, తోటి మిత్రులు కిందకి రమ్మని చెప్పినా, పోలీసులు మైకులో నిరంతరం దిగి రావాలని, న్యాయం జరుగుతుందని వివరించినా ససేమిరా అంటూ దిగిరాలేదు. ఇద్దరు అధ్యాపకులను అరెస్టు చేసి, జైలుకు పంపాలని, కలెక్టరు వచ్చి తమకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు న్యాయం చేస్తారని, కిందకు దిగిరావాలని మృతుడి తల్లి తన రెండో కుమారుడిని బతిమాలినా దిగిరాకపోవడంతో ఆమె తీవ్రంగా రోదించింది. తల్లి పరిస్థితి చూసి, మిత్రులు, బంధువులు కూడా మృతుడి సోదరుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో అక్కడ ఉత్కంఠ నెలకొంది. రాత్రి ఏడు గంటల సమయంలో ఎటూ తేలకపోవడంతో కొందరు ఎంవీపీ సర్కిల్ వద్దకు వచ్చి, వాహనాలను నిలిపేసి, రోడ్డుపైనే బైఠాయించారు. చివరకు భీమిలి ఆర్డీవో, ఇతర అధికారులు కళాశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి విద్యార్థులు కిందకు దిగేలా ఒప్పించారు. సైబర్, మహిళా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తారని, తగిన ఆధారాలతో నిందితులపై చర్యలు తీసుకుంటామని ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి హామీ ఇచ్చారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయడానికి కళాశాల యాజమాన్యం సహకరిస్తుందని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా భారీగా పోలీసులను మోహరించారు. ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, సీఐలు, ఎస్‌ఐలు బందోబస్తు నిర్వహించారు. ఆ ప్రాంతం బంధువులు, కుటుంబ సభ్యుల రోదనతో మిన్నంటింది. విద్యార్థులకు సంఘీభావంగా ఏబీవీపీ నాయకులు నిరసనలో పాల్గొన్నారు.



న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తున్న విద్యార్థులు

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఎంవీపీ కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న యువకుడు సాయితేజ ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్వో) ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఇద్దరు మహిళా అధ్యాపకుల వేధింపుల వల్లే విద్యార్థి మృతి చెందినట్లు స్నేహితులు, సహచర విద్యార్థులు చెపుతున్నారని, ఇలాంటి సంఘటన జరగడం దారుణమని సంస్థ అధ్యక్షులు కె అభిలాష్ పేర్కొన్నారు. పాదర్శకంగా దర్యాప్తు జరపాలన్నారు.

ఘనంగా రాష్ట్రావతరణ దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులతో బహుమతులు పొందిన విద్యార్థులు

మద్దిలపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం పైడా కౌశిక్ మెమోరియల్ ట్రస్టు, కళాభారతి సంయుక్తంగా పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల, పాఠశాల విద్యార్థులకు పొట్టి శ్రీరాములు అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 13 కళాశాలలు, 22 పాఠశాలలనుంచి 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల, పాఠశాల స్థాయిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు విద్యార్థులను ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసి నిర్వాహకులు పైడా కృష్ణప్రసాద్, సీఏ స్‌ఎన్ రాజుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

అనంతరం పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందన్నారు. మన రాష్ట్రం ఏర్పాటుపై విద్యార్థులు అవగాహన కల్పించాలనే ఈ పోటీలునిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాభారతి నిర్వాహకులు రాంబాబు, రామ్‌గోపాల్, డాక్టర్ సరోజజ్యోతి పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ

వెంకోజీపాలెం/ పెదవాల్తేర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డులో ఇటీవల సికిల్‌సెల్ అనామియా వ్యాధి కారణంగా విమ్స్‌లో చికిత్స పొందుతున్న పొన్నాడ కీర్తనకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్‌ను శనివారం 16వ వార్డు టీడీపీ క్లస్టర్ ఇంచార్జి నారు గోపి, విశాఖ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మొల్లి శోభ లు స్వయంగా వెళ్లి అందజేశారు. 118 సచివాలయం అడ్మిన్ నరేష్, టీడీపీ 16వ వార్డు ఉపాధ్యక్షులు రామానుజం భరత్‌కుమార్‌లతో కలిసి చిన్నారి కీర్తనను పరామర్శించి, ఆరోగ్యంపై ఎటువంటి ఆందోళనకు లోను కావద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పి పెన్షన్‌ను అందజేశారు.

పెదవాల్తేరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద పెదవాల్తేరు, చినవాల్తేరు తదితర ప్రాంతాల్లో చేపట్టిన పింఛను పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలు క్షేమంగా, సంతోషంగా ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు బైరెడ్డి పోతన్నరెడ్డి, కంబాపు శివారెడ్డి, కాకి శివశంకర్ రెడ్డి, గోవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఆంధ్రజాతిని అవమానించిన రాష్ట్ర ప్రభుత్వం

- తెలుగుదండు ఆధ్వర్యంలో నిరసన


తెలుగుతల్లి విగ్రహం వద్ద ప్లకార్డులు చూపుతూ నిరసన తెలుపుతున్న తెలుగుదండు ప్రతినిధులు

మద్దిలపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా ఆంధ్రజాతిని అవమానించిందని తెలుగుదండు వ్యవస్థాపకులు పరవస్తు సూరి విమర్శించారు. మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద శనివారం తెలుగుదండు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరవస్తు సూరి మాట్లాడుతూ రాష్ట్రావతరణ దినోత్సవమే చేపట్టకపోయిన ప్రభుత్వం అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో నిర్మించి ఆంధ్రులను ఉద్ధరిస్తాననడం బూటకమేనన్నారు. ఇలాంటి ఉత్సవాలు నిర్వహించకపోవడం వల్ల తెలుగుకు పెద్ద ముప్పే పొంచివుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాలతో అయినా మన భాషా సంస్కృతులను పరిరక్షించుకొని భావితరాలకు అందజేయడం తెలుగు భాషాభిమానుల కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో తిరుపతి రాజమన్నార్, గాయకుడు దేవిశ్రీ, శ్యామ్‌సుందర్, లలిత, రామకృష్ణ, సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్య సదస్సు కోసం బీఆర్‌టీఎస్ రోడ్లకు ముస్తాబు

ఆరిలోవ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల రెండోవారంలో నగరంలో భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో నగరంలోని రోడ్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా హనుమంతవాక జంక్షన్ నుంచి అడవివరం వరకు గల బీఆర్‌టీఎస్ రోడ్డులో డివైడర్లకు రంగులు వేస్తున్నారు. ఇప్పటికే ముడసర్లోవ పార్కు సమీపంలో గల బీఆర్‌టీఎస్ రోడ్డు డివైడర్లను సుందరంగా తీర్చిదిద్దారు.


డివైడర్లకు రంగులు వేస్తున్న సిబ్బంది

భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన


భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మంగవేణి

ఎంవీపీ కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరు గొల్లవీధిలో భూగర్భ డ్రైనేజీ పనులకు శనివారం వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణి శంకుస్థాపన చేశారు. సక్రమ డ్రైనేజీ వ్యవస్థ రూపొందించడం ద్వారా నగర సుందరీకరణ సాధ్యమవుతుందని, ప్రజల సహకారం కూడా అవసరమని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక ఏకాదశి పూజలు

- కిక్కిరిసిన వైష్ణవాలయాలు
- వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు


ఎంఎంటీసీ త్రిమూర్తిక వెంకన్న స్వామిలో భక్తుల పూజలు


ఎంవీపీ కాలనీ : పూజల్లో పాల్గొన్న భక్తులు


పెదవాల్తేర్ : కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆకాశ దీపారాధన నిర్వహిస్తున్న మహిళలు

వెంకోజీపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని వైష్ణవాలయాలన్నీ శనివారం తెల్లవారు జాము నుంచి కిక్కిరిసిపోయాయి. కొత్త వెంకోజీపాలెంలోని రామాలయంలో వేంచేసియున్న ముడుపుల వెంకన్న స్వామికి ముడుపులను చెల్లించుకునే వారు మాత్రమే కాకుండా ఏకాదశి పూజలు నిర్వహించే భక్తులతో కలిసి మరింత రద్దీ పెరిగి ఇక్కడి వీధులతో పాటు రోడ్డు కూడా భక్తులతో నిండిపోయింది. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రామ సేవా సంఘం సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ కార్తీక ఏకాదశిని సందర్భంగా భక్తులు రోడ్డుపైకి బారులు తీరారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి టి.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావ పాల్గొన్నారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులో కొలువైయున్న కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ సీహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో విశేష పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచే క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆకాశదీపం వెలిగించారు. కార్యక్రంలోఆలయ అర్చకులు కాశీప్రసాద్, చిన అప్పారావు, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెదవాల్తేర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం శనివారం ఏకాదశి సందర్భంగా తెల్లవారు జాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా దివ్యదర్శణమైవెలసిన స్వామివారికి తెల్లవారు జాము నుంచే ఆలయ ప్రధాన అర్చకులు సూర్యనారాయణ పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆరో సెక్టరులోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో శనివారం కార్తీక శుద్ధ ఏకాదశి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయానికి క్యూ కట్టారు. సామూహిక సత్యనారాయణ వ్రతంలో 50 మంది దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ కార్యదర్శి కేవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

రామ్‌నగర్‌లో..

రామ్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హరేకృష్ణా మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు, ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్తదాస్ కార్తీకమాస విశిష్టతను వివరిస్తూ అఖండ హరినామ సంకీర్తన తులసి పూజ చేసి శ్రీ కృష్ణుడికి వెయ్యి దీపాలతో ఆరాధించారు. అనంతరం ప్రసాదాన్ని అందించారు, కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు

ఆరిలోవలో..

ఆరిలోవ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చినగదిలిలో గల వేంకటేశ్వరస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేద పండితులు వెంకటనరసింహాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరిలోవ, చినగదిలి తదతర ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు.


రామ్‌నగర్ : దీపోత్సవం నిర్వహిస్తున్న మహిళలు


ఆరిలోవ : చినగదిలిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

తుపాను బాధితులకు నిత్యావసరాలు..


బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న కూటమి నేతలు

ఆరిలోవ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను కారణంగా నిరాశ్రయులైన జీవీఎంసీ 12వ వార్డులోబీసీ కాలనీకి చెందిన బాధితులకు శనివారం అధికారులు నిత్యావసర సరుకులు అందజేశారు. ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం, కిలో చొప్పున కంది పప్పు, వంటనూనె, పంచదార, ఉల్లిపాయలు తదితరాలను అందజేశారు. కార్యక్రమంలో 9 10, 11, 12 వార్డులకు చెందిన కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని తీర ప్రాంత మత్స్యకారులకు తుఫాను సహాయాన్ని కార్పొరేటరు మంగవేణి శనివారం అందించారు. ఒక్కో కుటుంబానికి 50 కిలోలబియ్యం, కిలో చొప్పున కందిపప్పు, బంగాళా దుంపలు, ఉల్లిపాయలు, పంచదార, లీటరు వంట నూనె అందించారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 52, గుత్తి/రవి వంకాయలు 58, బెండకాయలు 54, పచ్చిమిర్చి 34, బజ్జి పకోడి మిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 48, ఆనపకాయ 2, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 22, క్యారెట్ 58, దొండకాయలు 32, బంగాళ దుంపలు 20, అరటి కాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 54, దోస కాయలు 38, పోటల్స్ 58, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 52, కంద దుంప 46, ముల్లంగి 34, దేముడు చిక్కుడు 66, గోరుచిక్కుడు46, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండ ఉసిరి 64,కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్క కూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, కర్రపెండలం 22, మామిడిఅల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఎట్టకేలకు ఏయూలో 47 మంది బోధనేతర సిబ్బందికి స్థానచలనం

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బోధనేతర (నాన్ టీచింగ్) సిబ్బందికి ఎట్టకేలకు బదిలీలు చేపట్టారు. వివిధ కేడర్లకు చెందిన 47 మందిని బదిలీ చేస్తూ వర్సిటీ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో డిప్యూటీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు 13 మంది, సూపరింటెండెంట్లు 19 మంది, సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, హెడ్ కుక్, మెస్ మెయిడ్ తదితర కేడర్ ఉద్యోగులు 15 మంది ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైనవారు కావడంతో తాజాగా వారిని బదిలీ చేశారు. పాలనా పరమైన నిర్ణయాలు బయటకు పొక్కడంతో పాటు కొన్నేళ్లుగా ఎంతో మంది ఒకేచోట పాతుకుపోయి ఉండడంతో అవినీతి కి ఆస్కారం ఏర్పడుతోందన్న ఉద్దేశంతో బదిలీలు చేపట్టారు. అయితే, బదిలీ ప్రస్తుతం ఉన్న స్థానాల్లో కొనసాగేందుకు పలువురు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. తమ పరిధిలోని సెక్షన్ హెడ్స్, ఇతర ఉన్నతాధికారుల ద్వారా చెప్పిస్తున్నారు. సదరు ఉద్యోగి వెళ్లిపోతే ఫైళ్లు పెండింగ్‌లో ఉంటాయని, ఇబ్బందులు వస్తాయంటూ ఉన్నతాధికారులను ఒప్పించే పనిని ఆయా సెక్షన్ల అధికారులు తీసుకున్నారు. ఈ తరహా లాబీయింగ్‌కు వర్సిటీ అధికారులు దూరంగా ఉండాలని, ఒకరిద్దరిని కొనసాగించినా, మిగిలి న వారు ప్రయత్నాలు సాగించే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. కీలక స్థానాల్లో కొన్నేళ్లుగా కొనసాగుతున్న వారిని కదిలించిన అధికారులు, మరికొన్ని స్థానాల్లో ఎప్పటి నుంచో తిష్టవేసినవారిని పట్టించుకోలే దని చెబుతున్నారు. వీరిలో విభిన్న ప్రతిభా వంతులను వేధిస్తున్న రికార్డు సెక్షన్‌కు చెం దిన అధికారి, మరో ఇద్దరు, ముగ్గురు ఉన్న ట్లు చెబుతున్నారు. ఇటువంటి వారిని కదిపితే పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసినట్టవుతుందని కొందరు ఉద్యోగులు పేర్కొంటున్నారు.

ఎయిర్‌పోర్ట్ సీఐగా శంకరనారాయణ
బాధ్యతల స్వీకారం


సీఐ శంకరనారాయణ

మాధవధార, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) ; ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీస్ స్టేషన్ కొత్త సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వి.శంకరనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఎస్‌ఐలు ప్రసాద్, రామకృష్ణ, ఏఎస్‌ఐ రవిచంద్ర సిబ్బంది కొత్త సీఐకి పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వక ఆహ్వానం పలికారు. 2009 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన వి.శంకరనారాయణ గాజువాక, దువ్వాడ పోలీస్‌స్టేషన్లు సహా కంచరపాలెం ట్రాఫిక్ విభాగంలోనూ గతంలో విధులు నిర్వహించారు. 2023లో సీఐగా పదోన్నతి పొందారు. సీఐగా కోర్టు మానిటరింగ్, సీసీఎస్ విభాగాల్లో విధులు నిర్వహించిన అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు స్టేషన్ సిఐగా విధులు చేపట్టిన పాత సీఐ ఉమామహేశ్వరరావు నగరంలోని వీఆర్ 3 విభాగానికి బదిలీ అయ్యారు.

ఎన్‌సీసీ అధికారి
మేజర్ బ్రహ్మానందరెడ్డికి సత్కారం


బ్రహ్మానందరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

సీతమ్మధార, స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ ఆఫీసర్‌గా సుదీర్ఘంగా 22 సంవత్సరాలు విధులు నిర్వహించిన మేజర్ టి.బ్రహ్మానందరెడ్డిని బుల్లయ్య కాలేజి యాజమాన్యం శనివారం ఘనంగా సత్కరించింది. 2003లో 2(ఎ) బెటాలియన్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అనేక మంది విద్యార్థులు ఆర్డీ పెరేడ్‌కు ప్రాతినిధ్యం వహించేలా బ్రహ్మానందరెడ్డి తీర్చిదిద్దారు. అలాగే ఉచిత రక్తదాన శిబిరాలు నిర్వహించి బ్లండ్ బ్యాంకుల నిర్వహణకు సహకరించడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంపై ఆసక్తి చూపేవారు. బుల్లయ్య కాలేజి కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్‌తో పాటు జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్, ఎన్‌సీసీ ఆఫీసర్స్ ఫ్లైట్ లెఫ్టినెంట్ డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి, కెప్టెన్ కె.ఉమానాగేశ్వరి, సబ్ లెఫ్టినెంట్ లక్ష్మణబాబు, రమా గోస్వామి తదితరులు బ్రహ్మానందరెడ్డిని ఘనంగా సత్కరించారు.

ప్రమాదంలో భారత రాజ్యాంగం

» ఏఐడీఆర్‌ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి విజేంద్ర నిర్మల్



గీతాలు ఆలపిస్తున్న చైతన్య మండలి బృందం కళాకారులు, వేదికపై విజేంద్ర నిర్మల్, సీపీఐ నేత జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు

సీతంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర సాగుతోందని, రాజ్యాంగం ప్రమాదంలో ఉందని ఆల్ ఇండియా దళిత రైట్స్ మూమెంట్ (ఏఐడీఆర్‌ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి విజేంద్ర నిర్మల్ (న్యూఢిల్లీ) పేర్కొన్నారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 'రాజ్యాంగం-దళిత హక్కులు- బీజేపీ విధానాలు' అంశంపై శనివారం రాజ్యాంగం పరిరక్షణ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఎన్డీయే పాలనలో కుల, మత విద్వేషాలు పెరిగాయన్నారు. దళితులు పోరాడి సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం తగిన స్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా వేలాది కేసులు నమోదు అవుతున్నా, శిక్షలు మాత్రం అయిదు శాతానికి మంచి పడటం లేదని పేర్కొన్నారు. హర్యానాలో సీనియర్ ఐపీఎస్ అధికారి రాన్‌కుమార్ ఆత్మహత్య చేసుకునే పరిస్థితిని మనువాదులు కల్పించారని మండిపడ్డారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ జైళ్లలో ఎలాంటి బెయిల్ లేకుండా మగ్గిపోతున్న వారిలో అధిక శాతం ఎస్సీ, ఎస్టీలే అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలులో ఉన్నప్పటికీ వారి అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయింపు లేదని ఆరోపించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీలు 25 శాతంగా ఉన్నప్పటికీ వారి హక్కుల రక్షణ మాత్రం కరువైందన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తులను కొల్లకొడుతున్నారని, విశాఖలో గూగుల్ కంపెనీలో 300 మంది మించి ఉద్యోగాలు రావని, వారిలో 100 మంది ఆపరేటర్లు, 200 మంది వరకు హౌస్ కీపింగ్ సిబ్బంది మాత్రమే ఉంటారన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకరరావు మాట్లాడుతూ భారతదేశం లౌకిక, సామ్యవాద ప్రజాస్వామ్య దేశమని, ఆయా పదాలను తొలగించడానికి బీజేపీ, తెరవెనుక ఉన్న ఆర్ఎస్ఎస్‌లు ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. దేశ ప్రథమ పౌరునిగా ఉన్న రాష్ట్రపతి ద్రౌపదిముర్మును కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభానికి పిలవకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు.

చైతన్య మండలి బృందం ఎల్.కృష్ణ ఆధ్వర్యంలో చైతన్య గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు రాజులు, రిమ్స్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ తెన్నేటి జయరాజు, ప్రొఫెసర్ అర్జున, కేవీపీఎస్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ


45వ వార్డులో ఫించన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

అక్కయ్యపాలెం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. గ్రేటర్ విశాఖ 45వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ఫించన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో జడ్సీ బి.రాము, ఏపీడీ పుణ్యవతి, కూటమి నాయకులు ముత్యాలనాయుడు,నూకరాజు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 26వ వార్డులో ముక్కా కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఫించన్లు పంపిణి చేశారు. అలాగే 27వ వార్డులోని దొండపర్తి, శ్రీనగర్, ద్వారకానగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ గొలగాని వీరరావు బుజ్జి లబ్దిదారులకు ఫించన్లు పింపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెంలో..

కంచరపాలెం,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అందించే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం వివిధ ప్రాంతాల్లో పింఛనుదారులకు అందజేశారు. జీవీఎంసీ 48వ వార్డులో సీనియర్ టీడీపీ నాయకులు గొర్లె అప్పారావు, సత్యాడ అప్పారావు లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే 55వ వార్డులో టీడీపీ నాయకురాలు ఈతలపాక సుజాత, 54వ వార్డులో బీజేపీ వార్డు అధ్యక్షుడు రంగు ముద్రరాంబాబు, కార్పొరేటర్ చల్లా రజని, 47వ వార్డులో చెంగల శ్రీను పింఛన్లు పంపిణీలో పాల్గొన్నారు.

మాధవధారలో..

మాదవధార, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) ; జీవీఎంసీ 50వవార్డులో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను వార్డు సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ అందజేశారు. మురళీనగర్, మాధవధార, ఎన్జీజీవోస్ కాలనీల పరిధి 17 సచివాలయాల్లో ఉదయమే పంపిణీ ఆరంభమైంది. 50వ వార్డులో టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, బీజేపీ నాయకులు బి.శ్యామల తదితరులు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే 49వ వార్డులో తెలుగుదేశం పార్టీ వార్డు అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, నాయకులు, వార్డు సచివాలయ సెక్రటరీలతో పింఛన్లు అందించారు. టీడీపీ 51వ వార్డు అధ్యక్షుడు సనపల. కీర్తి, జనసేన వార్డు ప్రెసిడెంట్ గుడివాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో..

సీతంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేటలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఇసరపు వాసు చేతుల మీదుగా అర్హులైన వారికి పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. వార్డులోని ఇంటింటికి వెళ్లి వృద్ధాప్యంలో ఉన్నవారికి పింఛన్లు అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు కార్యదర్శి పాలెపు ధనాజీ, కూటమి పార్టీల వార్డు సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు, సచివాలయం సెక్రటరీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు రేషన్ సరకుల అందజేత

కంచరపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మొంథా తుఫాను నేపథ్యంలో వేటకు వెళ్లని మత్స్యకార కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత రేషన్ సరకులు, నిత్యావసరాలను కూటమి నాయకులు శనివారం పంపిణీ చేశారు. జీవీఎంసీ 55వ వార్డు పరిధి కొత్త రెడ్డి కంచరపాలెంలో డిపోల వద్ద టీడీపీ నాయకులు లబ్దిదారులకు సరుకులను పంపిణీ చేశారు. టీడీపీ వార్డు టీడీపీ అధ్యక్షుడు బండి రంజిత్ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు పాల్గొని అందజేశారు. లబ్దిదారులకు యాభై కిలోల బియ్యంతో పాటు పంచదార, వంట నూనె, బంగాళా దుంపలు, ఉల్లిపాయలు, కందిపప్పు తదితర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.అప్పారావు, రమణ అప్పారావు, కోటి, వెంకటరావు, యమున, చిన్ని, సుధ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ జేడీకి సీఎం అవార్డు



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న జేడీ లక్ష్మణరావు

బీచ్‌రోడ్డు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌లో మత్స్యకారులకు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు అందించిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శనివారం ఉండవల్లిలోని సీఎం కార్యాలయంలో అవార్డును ప్రదానం చేశారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ సీఎం చేతుల మీదుగా అవార్డు అందు కోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

డీసీపీ-1గా మణికంఠ చందోలు

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో డీసీపీ-1గా మణికంఠ చందోలును నియమిస్తూ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఉన్న కృష్ణకాంత్‌ను విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మణికంఠను నియమించారు. మణికంఠ గతంలో డీసీపీ-1గా నగరంలో పనిచేశారు. రెండు రోజుల కిందట డీసీపీ-1గా జగదీశ్‌ను నియమించారు. తాజా ఉత్తర్వులతో ఆయన నియామకం రద్దయినట్టు అయ్యింది.

మొంథా బాధితులకు ఆపన్నహస్తం అందించాలి

మురళీనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) ; మొంథా తుపాను బాధితులకు సత్వర న్యాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీజేపీ నాయకులు మూల వెంకటరావు విజ్ఞప్తి చేశారు. కోనసీమ, కాకినాడ సహా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లోనూ భారీ నష్టం వాటిల్లడంతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. వరి పంటలు కోతల సమయంలో తుపాను కలిగించిన నష్టాన్ని కేంద్రం సాయంతో రైతులకు తక్షణం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పేద కుటుంబానికి సహాయం


సామగ్రి అందజేస్తున్న ఇసరపు వాసు

సీతంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట గణేష్‌నగర్‌లో పార్వతీశ్వరాలయం వద్ద గల మానసిక వికాలంగుల కుటుంబానికి ఆర్థిక సహాయం అందించే క్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు ఇసరపు వాసు బియ్యం బస్తా, కందిపప్పు, చింతపండు, కూరగాయలు సహాయం అందించారు. కార్యక్రమంలో జనేసన పార్టీ నాయకుడు కె.ఈశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఏకపక్ష ధోరణి

... 5వ పేజీ తరువాయి

కంటే పురుషులే పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. దీనిపై స్థానిక మహిళలు కొద్దిసేపు నిరసన వ్యక్తంచేయడంతో ఆ తరువాత వారిని లోపలకు అనుమతించారు. అమ్మవారి దర్శనాలు చేయించి జాకెట్ ముక్కలు పెట్టి పంపించారు.

ఈఓపై కలెక్టర్‌కే ఫిర్యాదు

ఆలయ ఈఓ శోభారాణిపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు 38వ వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. కార్తీక మాసంలో అయ్యప్పస్వాములు మాలలు వేసుకుంటారని, అమ్మవారి సమక్షంలో మాలధారణ చేయడం ఆనవాయితీగా వస్తుంటే...దానికి ఈఓ అనుమతించడం లేదని ఆమె ఫిర్యాదు చేశారు. కొన్ని దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీని పక్కన పెట్టి మాలలు బయట వేసుకోవాలని చెబుతున్నారని, ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్‌ను కోరారు.

వైద్యుడి వక్రబుద్ధిపై ఆరా

... 5వ పేజీ తరువాయి

పనిలో నిమగ్నమయ్యారు. సదరు వైద్యుడు పనిచేస్తున్న ఆస్పత్రికి కళాశాల అధికారులు ఫోన్లు చేసి వివరాలు సేకరించారు. అసలేమి జరుగుతోందని సీనియర్ వైద్యులతోపాటు వైద్య విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అయితే కొంతమంది వైద్యులు, వైద్య విద్యార్థినులు తమకు ఎటువంటి ఇబ్బందులు వస్తాయోనన్న భయంతో ఏమీ తెలియదని తప్పుకునే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. ఇదిలావుంటే సదరు వైద్యుడి గురించి మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వచ్చే నెలలో తన పుట్టినరోజు ఉందని, ఖరీదైన గిఫ్ట్ ఇవ్వాలని వైద్య విద్యార్థులకు చెప్పినట్టు తెలిసింది. అలాగే ఏదైనా సమస్య వస్తే తనకు మాత్రమే చెప్పాలని, కాదు..కూడదు అంటే మీ భవిష్యత్తు నా చేతిలో ఉందన్న విషయం మర్చిపోవద్దంటూ వైద్య విద్యార్థులను తన గ్రిప్‌లో పెట్టుకునే ప్రయత్నం చేస్తుంటారని చెబుతున్నారు. వసూళ్ల వ్యవహారాలకు ప్రత్యేకంగా ఒకరిని పెట్టుకున్నట్టు చెబుతున్నారు.

భయం..భయంగానే..

ఇదిలావుండగా ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో తమను మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తారేమోనని వేధింపులకు గురైన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అయితే, మెడికల్ కాలేజీ అధికారులు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొన్నవారు తమ వద్దకు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని చెబుతున్నారు. విద్యార్థులు తన వద్దకు వచ్చి చెబితే న్యాయం చేస్తానని, వారి వివరాలను బయటకు వెల్లడించే ప్రసక్తే లేదని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి తెలిపారు.

ప్రేమసమాజం భూములపై పెద్దల కన్ను

... 5వ పేజీ తరువాయి

అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన కాళింగిరి శాంతి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారు. అయితే అంతా రచ్చ రచ్చ కావడంతో వైసీపీ నాయకులు వెనక్కి తగ్గారు.

ఖాళీగా ఉంచకూడదని వారి ఆలోచన

రుషికొండలో ఇప్పుడు ఎకరా భూమి రూ.40 కోట్లు పలుకుతోంది. ఆ లెక్కన ప్రేమ సమాజం భూమి విలువ సుమారు రూ.1,500 కోట్లు దాటి ఉంటుంది. అంత విలువైన భూమిని కాపాడడం కష్టమని, ఎవరికైనా లీజుకు ఇస్తే ఆదాయం వస్తుందని ప్రస్తుత కార్యవర్గం వాదిస్తోంది. రోడ్డు పక్కన కంటెయినర్లు పెట్టి అద్దెకు ఇస్తే ఆదాయం వస్తుందని కొందరు ప్రతిపాదించారు. అరకులోయ ప్రాంతం నుంచి గిరిజనులను తీసుకువచ్చి, వారికి అక్కడే నివాసం ఏర్పాటుచేసి, వారితో ఆర్గానిక్ వ్యవసాయం చేయించాలని మరికొందరు ప్రతిపాదించారు. వారు అక్కడే ఉంటారు కాబట్టి భూములకు రక్షణ ఉంటుందని ఆలోచించారు. ఇంకొందరు కల్యాణ మండపం నిర్మించాలని, గెస్ట్‌హౌస్‌లు నిర్మిస్తే, బాక్స్ క్రికెట్ వంటివి ఏర్పాటుచేస్తే బాగుంటుందని సూచించారు. కార్యవర్గం ఒక అభిప్రాయానికి రాకపోవడం, ఇది బయటకు పొక్కడంతో కొందరు కూటమి నేతలు రంగంలో దిగారు. ఆ భూములను తమ వారికి దీర్ఘకాలిక లీజుకు ఇప్పించుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. తమకు పది ఎకరాలు లీజుకు ఇవ్వాలని, క్రికెట్ ప్లేయర్లకు అక్కడ శిక్షణ ఇస్తామని కొందరు ప్రతిపాదించారు. ఇంకొందరు మంచి కన్వెన్షన్ సెంటర్‌తో పాటు రెస్టారెంట్ ఏర్పాటుచేస్తామని, ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్ పెడతామని 5 నుంచి 10 ఎకరాలు లీజుకు ఇవ్వాలని కోరారు. దీర్ఘకాలిక లీజుకు సంబంధించి ప్రభుత్వం నుంచి తాము ఆదేశాలు వచ్చేలా చూసుకుంటామని భరోసా ఇచ్చారు.

వేలం వేసే ఇవ్వాలి

ఇదిలావుండగా ఖాళీగా ఉన్న దేవదాయ శాఖ భూములను దీర్ఘకాలిక లీజుకు ఇవ్వాలని, ఇందుకోసం నలుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులతో రుషికొండలో ప్రేమ సమాజం భూములను దక్కించుకునే ప్రక్రియ వేగవంతం అవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే భూములను ఎవరికైనా లీజుకు ఇవ్వాలని అనుకుంటే పత్రికల్లో ప్రకటన ఇచ్చి బహిరంగ వేలం ద్వారానే కేటాయించాలి. అలా నిబంధనలను పాటిస్తారా? లేక ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా దక్కించుకుంటారా? అనేది చూడాలి.


బాధితులకు సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

కూటమి ప్రభుత్వం ప్రజా పక్షపాతి

» దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అల్లిపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రజా పక్షపాతి అని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన 34వ వార్డులోని అచ్చియ్యమ్మపేట వద్ద తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ముందు చూపు వల్లే తుఫాన్ నష్ట తీవ్రతను సమర్థంగా ఎదుర్కొగలిగామని చెప్పారు. బాధితులు ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.అనంతరం అచ్చియ్యమ్మపేట స్కూల్ వద్ద 31, 34, 35 వార్డులకు సంబంధించి జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులకు తెలిపి పరిష్కరించారు. మిగతా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్యానాయుడు, కార్పొరేటర్ కందుల నాగరాజు, ఏఎస్ఓ శ్రీహరి, జనసేన నాయకుడు శివ ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేజోన్ గెజిట్ విడుదల చేయాలి

» లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

డాబాగార్డెన్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేసిన ఇన్నాళ్లు అవుతున్నా గెజిట్ విడుదల చేయడం లేదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శనివారం ఆయన డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గెజిట్ విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తుందో చెప్పాలన్నారు. 2019లో కేంద్ర ప్రభుత్వం జోన్ ఏర్పాటు చేసిందని, 2020లో రూ. 170 కోట్ల బడ్జెట్ కేటాయింపులు కూడా చేసిందన్నారు. ఈమేరకు ఈఏడాది జనవరిలో డీపీఆర్‌ను కేంద్రం ఆమోదించిందని, ప్రధాని మోదీ కూడా శంకుస్థాపన చేశారన్నారు. కానీ గెజిట్ విడుదల చేయడం లేదన్నారు. ఈవిషయమై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని మురళీనగర్ ప్రాంతానికి చెందిన బొడ్డు భగవాన్ పాత్రుడు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం చెక్ రూపంలో పర్యవేక్షణాధికారి పి. సునీల్‌కు శనివారం ఆయన అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేష వస్త్రంతో సత్కరించారు.


ఇసుకకొండ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు (ఇన్‌సెట్లో) స్వామివారు

ఆలయాల్లో కార్తీక ఏకాదశి పూజలు

మురళీనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక ఏకాదశి పురస్కరించుకుని ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లోని శివ, కేశవ క్షేత్రాలన్నీ భక్తులతో శనివారం కిటకిటలాడాయి. మురళీనగర్ ఎన్జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి సుప్రభాతసేవ, ఉదయం 9 గంటలకు తులసీ దళార్చన చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. బర్మా క్యాంప్ రామాలయంలో కూడా ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. మాధవధార కొండ మీద ఉన్న భ్రమరాంబికా మల్లికార్జున ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.

కంచరపాలెంలో..

కంచరపాలెం : కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గొల్ల కంచరపాలెం, రెడ్డి కంచరపాలెం, గంగన్న నగర్, తుమ్మడిపాలెం, ఐటీఐ జంక్షన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేకువజాము నుంచే పూజలు ప్రారంభించారు. ఆలయాల వద్ద స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సాయంకాలం భజన నిర్వహించారు.

సత్యనారాయణ స్వామి వ్రతాలు

మహారాణిపేట : కేజీహెచ్ సమీపంలో ఉన్న ఇసుకకొండ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో ఏకాదశి పూజలు నిర్వహించారు. స్వామివారికి పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం సామూహిక వ్రతాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈఓ రాజగోపాలరెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

మార్గశిర మాసోత్సవాలకు రాట


రాట ముహూర్తం సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణతో పూజ చేయిస్తున్న అర్చకులు, చిత్రంలో ఆలయ అధికారులు

మహారాణిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బురుజుపేటలోని కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల శుభారంభ సూచికగా శనివారం రాట మహోత్సవం నిర్వహించారు. ఏటా కార్తీక శుద్ధ ఏకాదశి రోజున అంకురార్పణ చేస్తారు. ఉదయం 10.53 గంటలకు నాదస్వరం, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా రాట మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవంలో పాల్గొన్న ముత్తయిదువులకు పసుపు కుంకుమలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్లు జి. విజయలక్ష్మి నరసింహ చారి, ఆలయ కార్యనిర్వహణాధికారులు శోభారాణి, ఎస్. ఆనందకుమార్, ఎస్. రాజేంద్ర కుమార్, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ భవనాలు కూల్చేయండి

» రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో ప్లాన్‌కు విరుద్ధంగా ఈఏడాది ఆగస్టు తర్వాత నిర్మించిన భవనాలను కూల్చేయాలని రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని కార్పొరేషన్లు, పట్టణ స్థానిక సంస్థల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందిస్తోంది. అందులోభాగంగా 1985 నుంచి ఈఏడాది ఆగస్టు 31 మధ్య కాలంలో ఆమోదించిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈమేరకు అక్రమ నిర్మాణాలు ఊపందుకునే అవకాశం ఉంది కనుక వాటికి అడ్డు కట్టవేసేందుకు కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈఏడాది ఆగస్టు 31 తర్వాత ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించే అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనలు, యూనిట్ డీవియేషన్ చేసే భవనాలను గుర్తించి తొలగించనున్నారు.ఈమేరకు జీవీఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు 560 వార్డు సచివాలయాల పరిధిలో 2,500 మంది వార్డు సచివాలయ కార్యదర్శులకు సర్వే బాధ్యతలు అప్పగించారు. ఒక్కో సచివాలయానికి నలుగురు నుంచి ఆరుగురు వరకు కార్యదర్శులను నియమించింది. వారంతా రెండు రోజుల్లో తమకు కేటాయించిన వార్డు సచివాలయం పరిధిలో నిర్మాణంలో ఉన్న భవనాలతోపాటు ఇప్పటికే పూర్తయిన అక్రమ నిర్మాణాలను గుర్తించి నేరుగా డీటీసీపీకే నివేదిక అందజేయాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2019లో చివరిసారిగా జీవీఎంసీ పరిధిలో బీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయగా భవనాల క్రమబద్ధీకరణకు ఆరువేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి.

తాజాగా బీపీఎస్‌ను ప్రకటిస్తే ఏడు వేల వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆగస్టు 31 తర్వాత జరిగే అక్రమ నిర్మాణాలను తొలగించాల్సి వస్తే ఒక్కో వార్డులో వందల సంఖ్యలో అక్రమ భవనాలు, అదనపు అంతస్తులను తొలగించాల్సి ఉంటుంది. డీటీసీపీ ఆదేశాల మేరకు అధికారులు చర్యలకు ఉపక్రమిస్తే అక్రమ భవన నిర్మాణదారులకు ఇబ్బందులు తప్పవు.

'వైద్య సేవలు మెరుగుపర్చాలి'

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపర్చాలని కార్మిక సంఘం నాయకుల కోరుతున్నారు. ఇటీవల కాలంలో ఉద్యోగులు పదవి విరమణ చేయడంతో చాలావరకు వైద్యసేవలు తగ్గిపోయాయని కార్మిక నాయకలు పేర్కొన్నారు. తక్షణమే వైద్యులను నియమించి పూర్తిస్థాయిలో సేవలందించి, మందులు అందుబాటులో ఉంచాలన్నారు.అదేవిధంగా పెదగంట్యాడ ఆస్పత్రిని గతంలో మాదిరిగా నడపాలని కోరారు.

అవినీతి నిర్మూలనతోనే ప్రగతి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనతోనే అన్ని విధాల ప్రగతి సాధ్యమని స్టీల్‌ప్లాంట్ పవర్‌గ్రిడ్ స్టేషన్ ఇన్‌చార్జి వీకే.చంద్రసేన్ అన్నారు. సంస్థలో నిర్వహిస్తున్న విజెలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం అవినీతి సమాజానికి చీడపురుగని, దీంతో అన్ని వ్యవస్థలు కుంటుపడుతున్నాయన్నారు. నీతి, నిజాయితీతో ఏ రంగంలోనైనా ప్రగతి సాధ్యమన్నారు. అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

పనిలో నిజాయతీ తప్పనిసరి

▸▸ షిప్ బిల్డింగ్ సెంటర్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు

మల్కాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు నీతి, నిజాయతీతో విధులు నిర్వహించాలని, వాటితో పాటు భద్రతనూ పాటించినప్పుడే పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుందని షిప్ బిల్డింగ్ సెంటర్ డైరెక్టర్ జీ.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. షిప్‌యార్డులో జరుగుతున్న విజిలెన్స్ వారోత్సవాలకు శనివారం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ కోసం అవగాహన కల్పించడంలో భాగంగా గ్రామసభలు నిర్వహించామని అన్నారు. అందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు

పెందుర్తిరూరల్‌నవంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని చింతలఅగ్రహారం గ్రామంలో నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వరుల పక్ష రాత్రి ఉత్సవాల్లో శనివారం సాయంత్రం సారె సంబరం నిర్వహించారు. గ్రామంలో మహిళలు పిండి వంటకాలు పళ్లాలతో గుడికి వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా వెళ్లి రామాలయ చేరుకున్నారు. ఉత్సవ మూర్తులకు నివేదనలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'ఉక్కులో ఏకపక్షంగా కార్మికుల బదిలీ'

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో పని ఒత్తిడి పెరిగిందని, ఈ క్రమంలో కార్మికులను వివిధ విభాగాల నుంచి ప్రొడక్షన్ విభాగానికి మార్చే ముందు వారికి అక్కడి పనితీరుపై అవగాహన కల్పించాలని కోరుతూ జీఎం (హెచ్ఆర్) ఎస్.భానుకు స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ యాజమాన్యం ఏకపక్షంగా కార్మికులను బదిలీ చేస్తోందని, దీనివల్ల కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పని ప్రదేశంలో పనిమీద అవగాహన లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటువంటికి జరగకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు.

సినిమా గైడ్

- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య(గోపాలపట్నం), .

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 52, గుత్తి/రవి వంకాయలు 58, బెండకాయలు 54, పచ్చిమిర్చి 34, బజ్జి పకోడి మిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 48, ఆనపకాయ 2, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 22, క్యారెట్ 58, దొండకాయలు32, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 70, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 54, దోస కాయలు 38, పోటల్స్ 58, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద52, కందదుంప 46, ముల్లంగి 34, గోరు చిక్కుడు 46, కూర పెం డలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట)5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట)4, మామిడి కాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



మత్స్యకారులకు భరోసా కిట్లను అందిస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



మత్స్యకారులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మత్స్యకారులకు అండగా ఉంటాం

▸▸ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గాజువాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను కాపాడటంలో అలుపెరగని పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి సీఎం చంద్రబాబు అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన దిబ్బపాలెం, గంగవరం ప్రాంతానికి చెందిన 1200 మత్స్యకారులకు భరోసా కిట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతటి భారీ విపత్తు వచ్చినా ప్రజలను కాపాడడమే లక్ష్యంగా పనిచేశామని పేర్కొన్నారు. ఆస్తి నష్టం జరిగితే పూడ్చుకోవచ్చని, కానీ ప్రాణనష్టం జరగడానికి వీలు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు. తుఫాన్ సమయంలో ప్రజలను అప్రమత్తం చేసి, సురక్షితంగా ఉండేందుకు వివిధ విభాగాల అధికారులు ఎంతో కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో గాజువాక తహశీల్దార్ బి.శ్రీనివాసరావు, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

మల్కాపురం,(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టం కలిగిన ప్రతి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. 61వ వార్డు జాలర వీధిలో మత్స్యకార కుటుంబాలకు శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ నేపథ్యంలో చేపల వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునేందుకు నిర్ణయం తీసుకున్నదని, దీనిలో భాగంగా ప్రభుత్వం నిత్యావసర సరకులు పంపిణీ చేస్తోందని అన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా అందరికీ మేలు చేస్తోందని వివరించారు. తొలుత ఆయన మల్కాపురం పరిధిలోని పలు కాలనీల్లో పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం మత్స్యకారులకు నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ములగాడ తహశీల్దార్ రమేశ్‌నాయుడు, ఆర్ఐ దివ్య, జీవీఎంసీ జోనల్ 5 కమిషనర్ రాము, సివిల్ సప్లై ఏఎస్‌వో కృష్ణారావు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం: డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు

పెదగంట్యాడ, (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా పది రోజులు పాటు చేపల వేటకు దూరంగా ఉన్న గంగవరం, పల్లిపాలెం, జాలరి పల్లిపాలెం గ్రామాల్లోని మత్స్యకారులకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు నిత్యావసరాలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. తుఫాన్ బాధిత మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. అనంతరం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెదగంట్యాడ తహశీల్దార్ అమల, జోన్-3 సివిల్ సప్లై అధికారులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి



పొట్టి శ్రీరాములకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ కోసం ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఒక త్యాగమూర్తి అని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. గ్రంథాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి ఆంధ్రప్రదేశ్ విభజన కోసం పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి అమరుడయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.

79వ వార్డులో

అగనంపూడి, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి మహాత్మ గాంధీ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవతరణకు కృషి చేసిన పొట్టి శ్రీరాముల చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం శ్రీరాములు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వడ్లపూడి ఆర్యవైశ్య సంఘ సభ్యులు శనివారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపం ప్రాంగణంలో పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి మహేశ్ మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ కోసం 58 రోజులు నిరాహార దీక్షలు చేసి, ప్రాణాలను అర్పించిన అమరజీవిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను తొలగించొద్దని వినతి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల్లో ఎవరినీ తొలగించవద్దని, ఇప్పటివరకు తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని అధికారులను ఉక్కు కార్మిక సంఘ నాయకులు కోరారు. కార్మికులను తొలగించడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమిస్తామని నాయకులు హెచ్చరించారు.

'జాతీయ మహాసభలను జయప్రదం చేయండి'

గాజువాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖలో నిర్వహించనున్న సీఐటీ యూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జీవీఎంసీ కాంట్రా క్టు వర్కర్స్ యూనియన్ గాజువాక జోన్ నాయకుడు గొలగాని అప్పారావు కో రారు. గాజువాకలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ కాంట్రాక్టు కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్ జీతాలను త్వర గా చెల్లించాలని కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన బోరు ప్రారంభం

ఎస్.ఎ.డి.జంక్షన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బాజీజంక్షన్ సంతలో కార్పొరేషన్ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన బోరును కార్పొరేటర్ బొమ్మిడి రమణ శనివారం ప్రారంభించారు. బాజీజంక్షన్ సంతలో వర్తకులకు ఈ బోరు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.



కూర్మన్నపాలెంలో భక్తుల దీపారాధన



మల్కాపురం: రావిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు



గోపాలపట్నంలో స్వామివారికి మొక్కుకుంటున్న భక్తులు



పెదగంట్యాడలో సామూహిక తులసి పత్రి పూజ చేస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో కార్తీక ఏకాదశి పూజలు

▸▸ భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

▸▸ పెదగంట్యాడ, కూర్మన్నపాలెంలో సామూహిక వ్రతాలు

గాజువాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో కార్తీక ఏకాదశి పూజలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గాజువాకలో పలు చోట్ల వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపారాధన నిర్వహించారు. ఉడాకాలనీ వినాయకనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ఏకాదశి పూజలు

గోపాలపట్నం,(ఆంధ్రజ్యోతి): కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కొత్తపాలెం గ్రామంలో ప్రసన్న వెంకటేశ్వరుడి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే స్థానిక రజకకాలనీలో ఉమానాగలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి నిర్వహించిన సామూహిక అర్చనల్లో పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆలయాలు

అక్కిరెడ్డిపాలెం, (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా శనివారం షీలానగర్‌లోని బాలాజీ దివ్యక్షేత్రం, బీహెచ్‌పీవీపీ ప్రసన్నగిరిపై ఉన్న వెంకటేశ్వర వినాయకస్వామి ఆలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ఊరేగించారు. అనంతరం వెయ్యి కమలాలతో శ్రీవారికి సహస్రనామార్చన చేసి కుంభ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. బీహెచ్‌పీవీపీ ప్రసన్నగిరిపై ఉన్న వెంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో ప్రధానార్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

అగనంపూడి పరిసర ప్రాంతాల్లో

అగనంపూడి,(ఆంధ్రజ్యోతి): అగనంపూడి పరిసర ప్రాంత ఆలయాల్లో కార్తీక ఏకాదశని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతినగర్‌లో ఉన్న కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే పెదమడక శివాలయంలో స్వామివారికి రుద్రాభిషేకాలు నిర్వహించారు.

రావిచెట్టు వద్ద దీపారాధన

మల్కాపురం,(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో తొలి ఏకదశి సందర్భంగా మల్కాపురం మెయిన్‌రోడ్డులో ఉన్న రావిచెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేకువజామునుంచే మహిళలు చెట్టువద్దకు చేరుకుని పూజలు చేశారు. ఏటా ఈ రావిచెట్టుకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని స్థానికులు పేర్కొన్నారు.

వెంకటాద్రిపై ..

పెందుర్తి, (ఆంధ్రజ్యోతి): పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కార్తీక ఏకాదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామివారిక ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు రామానాజు చార్యులు స్వామివారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు చేసి ఏకాదశ హారతులిచ్చారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే వెంకటాద్రి శిఖరం దిగువనున్న మహాకామేశ్వరీ ఆలయంలో కార్తీక ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 జంటలు వ్రతంలో పాల్గొన్నాయి.

పలు వార్డుల్లో ..

కూర్మన్నపాలెం, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70, 86, 88వ వార్డుల పరిధిలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజులపాలెం, ఉడాకాలనీ లో ఉన్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయాలు పరిసరాల్లో ఉన్న ధ్వజస్తంభాలు, రావిచెట్టుల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆటోనగర్ చట్టివానిపాలెంలోని వైకుంఠ నారాయణ ఆలయంలో కార్తీక ఏకాదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బంగారు, వెండి ఆభరణాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీనగర్ కృష్ణాలయంలో కొలువైనున్న రమా సహిత సత్యన్నారాయణ స్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పూజలు చేశారు.

శ్రీనివాసునికి తులసి పత్రి పూజ

పెదగంట్యాడ, (ఆంధ్రజ్యోతి): కార్తీక ఏకాదని సందర్భంగా 65వ వార్డు గరుడాద్రి పై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరుడికి శనివారం లక్షతులసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భవానీ మాల ధరించిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. వేకువజామునుంచి మధ్యాహ్నం వరకు పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

24గంటల ఏకధాటి భజనలు

వేపగుంట, ఎస్.ఎ.డి.జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కార్తీక ఏకాదశి సందర్భంగా నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలవైన కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకూ ఏకాహన భజనలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కల్యాణ వెంకన్నకు చేపట్టిన ప్రత్యేక దీపాల అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. అలాగే 90వ వార్డు విమాన్‌నగర్‌లో వైకుంట వెంకటేశ్వరాలయంలో కల్యాణం నిర్వహించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 72వ వార్డులో సామాజిక పింఛన్లను ఆయన శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే 66వ వార్డులో టీడీపీ అధ్యక్షుడు గోమాడ వాసు సామాజిక పింఛన్ల పంపిణీ చేశారు.

ఇది చేతల ప్రభుత్వం: నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. వార్డులోని ఉడానగర్, రాజీవ్‌నగర్ సచివాలయాల పరిధిలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి వేగుంట శ్రీనివాస్, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు వడ్లపూడిలో పింఛన్లను కార్పొరేటర్ బొండా జగన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వైసీపీ ప్రభుత్వం పింఛన్ల పంపిణీని ఓ జూదంలా మార్చేసి, లబ్ధిదారులకు చుక్కలు చూపించిందని అన్నారు. ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే 71 వార్డు శ్రీరామ్ నగర్ సచివాలయ పరిధిలో రాష్ట్ర టీడీపీ పరిశీలకుడు పప్పు రాజారావు పింఛన్లను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. అలాగే 88వ వార్డు దువ్వాడ సచివాలయాల పరిధిలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు నాయుడు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏయూలో 47 మంది బోధనేతర సిబ్బందికి ఎట్టకేలకు స్థానచలనం

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బోధనేతర (నాన్ టీచింగ్) సిబ్బందికి ఎట్టకేలకు బదిలీలు చేపట్టారు. వివిధ కేడర్లకు చెందిన 47 మందిని బదిలీ చేస్తూ వర్సిటీ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో డిప్యూటీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు 13 మంది, సూపరింటెండెంట్లు 19 మంది, సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, హెడ్ కుక్, మెస్ మెయిడ్ తదితర కేడర్ ఉద్యోగులు 15 మంది ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైనవారు కావడంతో తాజాగా వారిని బదిలీ చేశారు. పాలనా పరమైన నిర్ణయాలు బయటకు పొక్కడంతో పాటు కొన్నేళ్లుగా ఎంతో మంది ఒకేచోట పాతుకుపోయి ఉండడంతో అవినీతి కి ఆస్కారం ఏర్పడుతోందన్న ఉద్దేశంతో బదిలీలు చేపట్టారు. అయితే, బదిలీ ప్రస్తుతం ఉన్న స్థానాల్లో కొనసాగేందుకు పలువురు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. తమ పరిధిలోని సెక్షన్ హెడ్స్, ఇతర ఉన్నతాధికారుల ద్వారా చెప్పిస్తున్నారు. సదరు ఉద్యోగి వెళ్లిపోతే ఫైళ్లు పెండింగ్‌లో ఉంటాయని, ఇబ్బందులు వస్తాయంటూ ఉన్నతాధికారులను ఒప్పించే పనిని ఆయా సెక్షన్ల అధికారులు తీసుకున్నారు. ఈ తరహా లాబీయింగ్‌కు వర్సిటీ అధికారులు దూరంగా ఉండాలని, ఒకరిద్దరిని కొనసాగించినా, మిగిలి న వారు ప్రయత్నాలు సాగించే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. కీలక స్థానాల్లో కొన్నేళ్లుగా కొనసాగుతున్న వారిని కదిలించిన అధికారులు, మరికొన్ని స్థానాల్లో ఎప్పటి నుంచో తిష్టవేసినవారిని పట్టించుకోలే దని చెబుతున్నారు. వీరిలో విభిన్న ప్రతిభా వంతులను వేధిస్తున్న రికార్డు సెక్షన్‌కు చెం దిన అధికారి, మరో ఇద్దరు, ముగ్గురు ఉన్న ట్లు చెబుతున్నారు. ఇటువంటి వారిని కదిపితే పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసినట్టవుతుందని కొందరు ఉద్యోగులు పేర్కొంటున్నారు.

నిండుకుండలా నాతయ్యపాలెం చెరువు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నాతయ్యపాలెం కృష్ణమహంతి చెరువు నిండుకుండలా కళకళలాడుతోంది. చెరువును అభివృద్ధి చేసిన తరువాత మొదటి సారి నీటిలో నిండుగా ఉండడం చూసి కాలనీల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణాన్ని చేపట్టిన కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ఈ చెరువు పరిరక్షణకు కూడా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. చెరువు చుట్టు ఉన్న స్థలాలను కాలువలు, రహదారుల పేరుతో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కాలనీ అభివృద్ధి కమిటీ ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై పెల్లుబికిన నిరసన

▸▸ దూకేస్తామంటూ భవనంపైకి ఎక్కిన మృతుడి సోదరుడు, మిత్రులు

▸▸ మహిళా అధ్యాపకుల అరెస్టుకు డిమాండ్

▸▸ భీమిలి ఆర్డీవో, ప్రిన్సిపాల్, అధికారుల హామీతో

▸▸ విద్యార్థులు, బాధిత కుటుంబం ఆందోళన విరమణ



మృతుడి చిత్రాలతో విద్యార్థుల నినాదాలు, భవనంపై నుంచి దూకేస్తామంటూ యువకుల హెచ్చరిక

ఎంవీపీ కాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీలోని సమతా డిగ్రీ కళాశాల విద్యార్థి సాయితేజ ఆత్మహత్య విద్యార్థుల్లో ఆగ్రహం పెల్లుబికేలాచేసింది. న్యాయం కావాలంటూ రోడ్డెక్కిన విద్యార్థులు కళాశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. మహిళా అధ్యాపకులను అరెస్టు చేయాలన్న డిమాండ్‌తో ఉదయం నుంచి ఆందోళన చేపట్టారు. ఓ పక్క మృతుడి బంధువులు కూడా కళాశాల ప్రాంగణం వద్ద నిరసన వ్యక్తం చేసి, లోపలకు వెళ్లేందుకు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు నిలువరించారు. రహదారిపై ప్రయాణించే వాహనాలను అడ్డుకుని ధర్నా చేశారు. సాయంత్రానికి మరింత మంది విద్యార్థులు తోడై నిరసన ఉధృతం చేశారు. మృతుడి సోదరుడు, మరో ముగ్గురు మిత్రులు కళాశాల భవనంపైకి ఎక్కి, న్యాయం చేయకపోతే అక్కడి నుంచి దూకేస్తామంటూ బెదిరించారు. తల్లిదండ్రులు, తోటి మిత్రులు కిందకి రమ్మని చెప్పినా, పోలీసులు మైకులో నిరంతరం దిగి రావాలని, న్యాయం జరుగుతుందని వివరించినా ససేమిరా అంటూ దిగిరాలేదు. ఇద్దరు అధ్యాపకులను అరెస్టు చేసి, జైలుకు పంపాలని, కలెక్టరు వచ్చి తమకు హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు న్యాయం చేస్తారని, కిందకు దిగిరావాలని మృతుడి తల్లి తన రెండో కుమారుడిని బతిమాలినా దిగిరాకపోవడంతో ఆమె తీవ్రంగా రోదించింది. తల్లి పరిస్థితి చూసి, మిత్రులు, బంధువులు కూడా మృతుడి సోదరుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో అక్కడ ఉత్కంఠ నెలకొంది. రాత్రి ఏడు గంటల సమయంలో ఎటూ తేలకపోవడంతో కొందరు ఎంవీపీ సర్కిల్ వద్దకు వచ్చి, వాహనాలను నిలిపేసి, రోడ్డుపైనే బైఠాయించారు. చివరకు భీమిలి ఆర్డీవో, ఇతర అధికారులు కళాశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి విద్యార్థులు కిందకు దిగేలా ఒప్పించారు. సైబర్, మహిళా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తారని, తగిన ఆధారాలతో నిందితులపై చర్యలు తీసుకుంటామని ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి హామీ ఇచ్చారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయడానికి కళాశాల యాజమాన్యం సహకరిస్తుందని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా భారీగా పోలీసులను మోహరించారు. ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, సీఐలు, ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు. ఆ ప్రాంతం బంధువులు, కుటుంబ సభ్యుల రోదనతో మిన్నంటింది. విద్యార్థులకు సంఘీభావంగా ఏబీవీపీ నాయకులు నిరసనలో పాల్గొన్నారు.

సంతానలేమితో సతమతం

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):

సంతానలేమి సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవన విధానాలను అలవాటు చేసుకునేలా ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కలిగించే ఉద్దేశంతో ఏటా నవంబరు 2న వరల్డ్ ఫెర్టిలిటీ డే నిర్వహిస్తున్నారు. సంతానలేమి సమస్యపై బహిరంగంగా మాట్లాడడం, అవగాహన కలిగించడం అన్న థీమ్‌తో ఈ ఏడాది ఫెర్టిలిటీ డే పాటిస్తున్నారు.

పెరుగుతున్న సమస్య

- అవగాహన అత్యంత కీలకం
- సకాలంలో వైద్య సేవలు పొందితే పరిష్కారం
- నేడు వరల్డ్ ఫెర్టిలిటీ డే





గతంతో పోలిస్తే సంతాన లేమి సమస్య ఎక్కువైంది. ప్రతి వంద మందిలో పది నుంచి 15 మంది దంపతులు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో పదుల సంఖ్యలో సంతాన సాఫల్య కేంద్రాలు (ఐవీఎఫ్ సెంటర్లు) వెలిశాయి. ఈ సమస్య గత పదేళ్లలో రెండు నుంచి మూడు రెట్లు పెరిగినట్టు నిపుణులు చెబుతున్నారు. ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం, అనేక కారణాలతో పిల్లలను కనడాన్ని వాయిదా వేసుకోవడం, పాలిసిస్టిక్ ఓవరీస్, వాతావరణ కాలుష్యం వంటివన్నీ సంతాన లేమి సమస్యగా వైద్యులు చెబుతున్నారు.

ఎప్పుడు సమస్యగా భావించాలి..

వివాహం జరిగిన ఏడాదికో, రెండేళ్లకో పిల్లలు పుట్టకపోవడాన్ని సంతాన లేమి సమస్యగా భావించకూడదు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించకుండా వివాహం జరిగి ఏడాది దాటినా సంతానం కలగకపోతే కొంతవరకు అనుమానించాలి. మరో ఏడాది వరకు నిరీక్షించినా ప్రయోజనం లేకపోతే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను తెలుసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

అనేక కారణాలు..

సంతాన లేమి సమస్య పూర్తిగా యువతులకు సంబంధించినదిగా చాలా మంది భావిస్తుంటారు. యువతీ, యువకులు ఇద్దరిలో ఏ ఒక్కరికి సమస్య ఉన్నా సంతానం కలిగేందుకు అవకాశం ఉండదు. పురుషుల్లో అయితే శుక్రకణాలు (స్పెర్మ్ కౌంట్) తక్కువగా ఉండడం, కదలిక సరిగా లేకపోవడం, ఆధునిక జీవనశైలి, పొగ తాగడం, మద్యం తీసుకోవడం వంటి అలవాట్లు ఈ సమస్యకు కారణమవుతుంటాయి. యువతుల్లో అయితే పాలిసిస్టిక్ ఓవరీస్ సమస్య ఒకప్పుడు అధికంగా ఉండేది. ప్రస్తుతం అండం ఉత్పత్తి కాకపోవడం (ఎగ్ రిలీజ్) ప్రధాన సమస్యగా మారింది. సంతానలేమితో బాధపడే మహిళల్లో ఎక్కువ మందిని ఈ సమస్య వేధిస్తోంది. 20, 30 ఏళ్ల యువతుల్లో ఇలాంటి లోపం ఉన్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఎగ్స్ తక్కువగా ఉండడానికి అనేక కారణాలున్నాయి. టాక్సిన్స్, థైరాయిడ్, డయాబెటిస్, కొన్నిరకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల ఎగ్స్ తక్కువగా ఉంటున్నాయి. ఒబెసిటీ వల్ల ఎగ్ క్వాలిటీ తగ్గింది. ఇన్‌ఫెక్షన్ల వల్ల ట్యూబ్స్ బ్లాక్ కావడం, కొన్ని రకాల క్యాన్సర్లు సమస్యకు కారణమవుతున్నాయి. ఈ తరహా ఇబ్బందులు ఉన్న జంటలు నిపుణులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి.

జీవన విధానంలో మార్పులు అవసరం..

జీవన విధానంలో కొన్ని రకాల మార్పులు చేసుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంది. వీలైనంత వరకు 30 ఏళ్లలోపు వివాహం చేసుకోవాలి. ఒత్తిడికి దూరంగా ఉండేలా చూసుకోవాలి. సరైన నిద్ర ఉండాలి. విటమిన్ డి సమస్య లేకుండా జాగ్రత్తపడాలి.

సమస్యను వేగంగా గుర్తించడం అత్యంత కీలకం



సంతాన లేమితో బాధపడుతున్న జంటల సంఖ్య పెరుగుతోంది. ఘోష ఆస్పత్రికి వచ్చే వంద మందిలో 15 మంది వరకు జంటలకు సంతాన లేమి సమస్యలు ఉంటున్నాయి. పరీక్షలు నిర్వహిస్తే స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండడం, ఎగ్స్‌లో ఇబ్బందులు, ట్యూబ్ బ్లాక్స్, గర్భ సంచిలో పొరలు వంటివి ఉంటున్నాయి. ఈ ఇబ్బందులను గుర్తించి వారికి అవసరమైన వైద్య చికిత్సలు చేస్తున్నాం. అయితే, జీవన విధానంలో వచ్చిన మార్పులు, ల్యాప్‌టాప్‌లో శరీరంపై పెట్టుకుని పని చేయడం వంటి చర్యల వల్ల ఈ సమస్య పెరుగుతోంది. జంక్ ఫుడ్, స్మోకింగ్ అలవాట్లు తీవ్రతను పెంచుతున్నాయి. బయట ఆహారానికి దూరంగా ఉండాలి. బరువును నియంత్రించుకోవాలి. రోజువారీ వ్యాయామం చేయాలి. ఫోలిక్ యాసిడ్ వంటి సప్లిమెంట్స్‌ను తీసుకోవాలి.30 ఏళ్లు దాటినంత వరకు చాలా మంది అమ్మాయిలు పెళ్లిళ్లు చేసుకోవడం లేదు. పెళ్లి తరువాత స్వేచ్ఛ అంటూ మరో రెండు, మూడేళ్లు పిల్లలను వద్దని అనుకుంటున్నారు. అప్పటికే వారిలో ఉన్న సమస్యలు గుర్తించడం లేదు. పిల్లలు కావాలనుకునే సమయానికి సమస్య పెరిగి మరిన్ని ఇబ్బందులకు కారణమవుతోంది. సంతానం విషయంలో దంపతులకు స్పష్టమైన అవగాహన ఉండడం అత్యంత కీలకం.

\- డాక్టర్ ప్రసాద్ ఉష
ఘోష ఆస్పత్రి సూపరింటెండెంట్

ఈఎన్‌సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా సుశీల్ మీనన్



విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1992లో నేవీలో ప్రవేశించారు. తుపాకులు, క్షిపణులు ప్రయోగించడంలో ప్రత్యేక నైపుణ్యం ఉంది. మూడు దశాబ్దాల సర్వీస్‌లో అనేక ఆపరేషన్లు, శిక్షణలు, సిబ్బంది నియామకాల్లో కీలకంగా వ్యవహరించారు. భారత యుద్ధనౌకలు రణ్‌విజయ్, తల్వార్‌లో గన్నరీ అధికారిగా, ముంబై నౌకకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు. టీఆర్‌వీ-71, కిర్పాణ్, డెస్ట్రాయర్ కోల్‌కత్తా, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ విక్రమాదిత్యలకు కమాండింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. 2023 మే నెలలో రియర్ అడ్మిరల్ ర్యాంకు పొందారు. తూర్పు నౌకాదళంలో ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్‌గా 2024 ఆగస్టులో పనిచేశారు. తన సేవలను మెచ్చి ప్రభుత్వం 2019లో విశిష్ట సేవా మెడల్‌తో సత్కరించింది.

తొక్కిసలాట ఘటనపై పరశురామరాజు దిగ్భ్రాంతి

పెదవాల్తేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో శనివారం జరిగిన తొక్కిసలాటలో 9 మంది మృతి చెంది, 13 మంది గాయపడడం పట్ల బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆవులను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ఆనందపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తర్లువాడ టోల్‌ప్లాజా వద్ద ఆవులను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ చింతా వాసునాయుడు శనివారం తెలిపారు. ఎస్ఐ శివ, సిబ్బంది టోల్‌ప్లాజా వద్ద విధులు నిర్వహిస్తుండగా ఆనందపురం నుంచి పెందుర్తి వైపు వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో తొమ్మిది ఆవులు కిక్కిరిసి ఉండటాన్ని గమనించి ఇద్దరు డ్రైవర్లను ప్రశ్నించారు. రాజాం సంతలో కొనుగోలు చేసి తాడేపల్లిగూడెంలో విక్రయానికి తరలిస్తున్నట్టు వారు చెప్పారు. ఆవులకు రక్షణ, ప్రభుత్వ అనుమతులు లేకుండా తరలిస్తుండటంతో వారిపై కేసు నమోదు చేసి బొలేరో వ్యాన్‌తో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆవులను సురక్షిత ప్రదేశానికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన గిరిజన కార్నివాల్



పచ్చజెండా ఊపి కార్నివాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్.



కొమ్ముకోయ నృత్యం

సాగర్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన స్వాభిమాన్ పక్షోత్సవాల కార్నివాల్‌ను రుషికొండ బీచ్‌లో శనివారం గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్.భార్గవితో కలసి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. కార్నివాల్ టీసీఆర్‌టీఎమ్ భవనం వరకు సాగింది. అక్కడ జ్యోతిప్రజ్వలన చేసిన కలెక్టర్ గిరిజన స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. సమరయోధుల సహకారం, త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన భాషలను భవిష్యత్ తరాలకు అందిస్తే వారి సంస్కృతి సంప్రదాయాలను కాపాడినట్టేనన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి మాట్లాడుతూ 15 రోజులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గిరిజన ఉత్పత్తులతో సంత ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. వివిధ ఐటీడీఏ పరిధులలోని గిరిజన కళాకారులు, ప్రదర్శించిన థింసా, మయూరి, కొమ్ముకోయ, తదితర సంప్రదాయ గిరిజన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గిరిజన మ్యూజియం ప్రాంగణంలో మొక్కలు నాటారు. టీసీఆర్‌టీమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మందారాణి, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులు, టీచర్లు, టీసీఆర్‌టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు సరుకుల పంపిణీ

విశాఖపట్నం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సముద్రం వేటకు వెళ్లని మత్స్యకారులకు శనివారం నుంచి సరుకులు పంపిణీ ప్రారంభించారు. పెదజాలారిపేటలో ప్రతి కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పంపిణీ చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్, సహాయ జిల్లా పౌరసరఫరాల అధికారి కల్యాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో 352 కుటుంబాలకు చెందిన 12,995 మంది మత్స్యకారులకు పంపిణీ చేశారు. మిగిలిన మత్స్యకారులకు రేషన్ డిపోలలో సరుకులు ఉంచామని డీఎస్‌వో తెలిపారు.



పెదజాలారిపేటలో బియ్యం పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

అప్పన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



మాడవీధిలో భక్తుల కోలాహలం

సింహాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన కార్తీకమాస శుక్లపక్ష ఏకాదశిని పురస్కరించుకుని సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే ఉత్తరాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. కొండదిగువ వరాహ పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి సమీప అటవీ ప్రాంతంలో కొలువుదీరిన భైరవస్వామిని దర్శించుకున్నారు. అమృతకలశాలను సమర్పించి ఆలయ ప్రాంగణంలో సకల గ్రహదోష నివృత్తికి నువ్వుల నూనె దీపాలను వెలిగించారు. అక్కడి నుంచి సింహగిరికి చేరుకుని గంగధారలో పుణ్యస్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించి తమ ఆరాధ్యదైవం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని కట్నకానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనూహ్యంగా వచ్చిన భక్తులతో సింహాద్రినాథుని ఆలయం కిటకిటలాడింది. తలనీలాలు, దర్శనాలు, అన్నప్రసాద భవనం, మాడవీధుల్లో .. ఇలా ఎక్కడ చూసినా భక్తుల కోలాహలం కనిపించింది.

జిల్లా కోర్టులో అటెండర్ ఉద్యోగాల పేరుతో మోసం

» ముగ్గురి అరెస్టు



పోకల సత్యవతి | ఆరేపల్లి సదాశివరావు | గుల్లపల్లి అప్పల రమణ

గాజువాక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బు తీసుకొని మోసగించిన ముగ్గురిని గాజువాక పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.... గాజువాక దరి జోగవానిపాలెం ప్రాంతానికి చెందిన పోకల సత్యవతి (58) తాను న్యాయవాదిగా చెప్పుకొంటూ జిల్లా కోర్టులో అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని గుల్లపల్లి శ్రీను, గండికోట కొండబాబుల నుంచి రూ.4,04,500 వసూలు చేసింది. డబ్బు చెల్లించినప్పటికీ ఉద్యోగం రాకపోవటంతో బాధితులు సత్యవతిని ప్రశ్నించారు. న్యాయవాదినని, తనపై ఎలాంటి చర్యలు తీసుకోలేరని ఎదురు తిరగటంతో బాధితులు గాజువాక పోలీసులను ఆశ్రయించారు. దీంతో గాజువాక సీఐ ఎ.పార్థసారథి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సత్యవతికి సహాయకులుగా గాజువాక దరి గుడివాడ అప్పన్నకాలనీ ప్రాంతానికి చెందిన గుల్లపల్లి అప్పల రమణ (33), ఆరేపల్లి సదాశివరావు (63) అనే ఆటో డ్రైవర్‌లు పనిచేశారని, వీరు కాలనీ పరిసర ప్రాంతాల్లో నిరుద్యోగ యువకుల తల్లిదండ్రులను లక్ష్యంగా చేసుకొని సత్యవతి ద్వారా ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని నమ్మబలికి పెద్ద మొత్తంలో నగదు వసూళ్లు చేశారని పోలీసులు తెలిపారు. ఈ ముగ్గురిని శనివారం గాజువాకలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని గాజువాక పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని రూ.21,500 విలువ చేసే 4.3 కేజీల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తమిళనాడుకు చెందిన సుకుమార్ కన్నిరం అనే వ్యక్తి గంజాయితో పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

పెట్టుబడిదారుల సదస్సుకు పర్యాటక ప్రాంతాల సుందరీకరణ



ప్రముఖులకు విందు ఇచ్చేదుకు అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14, 15 తేదీలలో జరిగే పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సుకు నగరంలోని పార్కులు, పర్యాటక ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. విదేశాల నుంచి వచ్చే ప్రముఖులు పర్యాటక ప్రాంతాలను సందర్శించే అవకాశం ఉన్నందున, వాటిని ఆకర్షణీయంగా మార్చాలన్నారు. అతిథులకు ఇవ్వనున్న భారీ విందుకు అనువైన స్థలం ఎంపిక చేసేందుకు శనివారం వీఎంఆర్‌డీఏ పార్కు, ఎంజీఎం, తెన్నేటి పార్కులు, సీ హ్యారియర్, టీయూ-142, సబ్‌మెరైన్ మ్యూజియంను సందర్శించారు. పార్కింగ్, భోజనం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనువైన ప్రాంతాన్ని ఎంపికచేసి అవసరమైతే మరమ్మతులు చేయించి, మొక్కలు నాటాలన్నారు. వీఎంఆర్‌డీఏ సీఈ వినయకుమార్, ఎస్ఈ భవానీశంకర్, సెక్రటరీ మురళీకృష్ణ, డీఎఫ్ఓ శివానీ పాల్గొన్నారు.

9 నుంచి రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

మహారాణిపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9 నుంచి రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆల్ విశాఖ చెస్ టోర్నమెంట్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ తెలిపారు. శనివారం బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఆయన నవోదయ జూనియర్ కళాశాలలో ఆదిత్యా చెస్ అకాడమీ ఈ పోటీలు నిర్వహిస్తుందన్నారు. విజేతలను విజయవాడలో జరిగే రేటింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పి.శ్యామలా దీపిక, బీశెట్టి రాము, మణికంఠరావు, సరేష్ కుమార్, కిరణ్ పాల్గొన్నారు.